ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శనివారం 4 జనవరి 2025



స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సరెండర్

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కార్యాలయంలో దాదాపు ఏడాది కాలంగా పనిచేస్తున్న కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.రామసుబ్బయ్యను రెండు రోజుల క్రితం ప్రభుత్వానికి సరెండర్ చేసినట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మూడు నెలలుగా పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను క్లియర్ చేయడంలో నిర్లక్ష్యం వహించారనే ఉద్దేశ్యంతో ఆయనను ప్రభుత్వానికి సరెండర్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారని సంబంధిత అధికారులు తెలిపారు.



రేపే ముగ్గుల పోటీలు

కడప, రాయచోటి, రాజంపేటల్లో..

ఆంధ్రజ్యోతి ఏటా సంక్రాంతికి ముందు నిర్వహించే ముత్యాల ముగ్గుల పోటీలు రేపు జరగనున్నాయి. తెలుగు సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణలో భాగంగా నిర్వహిస్తున్న ఈ పోటీలు కడప, రాయచోటి, రాజంపేట కేంద్రాల్లో ఆదివారం జరుగుతాయి. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు..గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్, ప్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సౌజన్యంతో పై మూడు కేంద్రాల్లో జరుగుతాయి. **కడప నగరంలో ఐటీఐ దగ్గర వికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో, రాయచోటిలో గాలివీడు రోడ్డులోని ఎగువఅబ్బవరం వద్ద ఉన్న అర్చన కాలేజీలో, రాజంపేటలో శాన్వీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈ పోటీలు** నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పోటీలు ఉంటాయి. పోటీల్లో పాల్గొనదలచిన మహిళలు ఉదయం 9 గంటలకే పోటీలు నిర్వహించే మైదానాల వద్దకు చేరుకుని తమ పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. పోటీలు జరిగే ప్రతి కేంద్రంలో మొదటి, రెండు, మూడు బహుమతులు ఉంటాయి. ఈ మూడు కేంద్రాల్లో ప్రథమ బహుమతి పొందిన ముగ్గురిలో ఒకరిని జిల్లా విజేతగా ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతారు. ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల విజేతలు, కర్ణాటక, తమిళనాడు నుంచి ఎంపికైన ఇద్దరు, మొత్తం 15 మందికి జనవరి 11వ తేదిన విజయవాడలో ఫైనల్ పోటీలు ఉంటాయి. **కడపలో జరిగే పోటీలకు వికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, రాయచోటిలో జరిగే పోటీలకు అర్చన కాలేజీ, రాజంపేటలో జరిగే పోటీలకు శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్నాయి.**

- ఆంధ్రజ్యోతి, కడప

శేషాచలం అడవిలో బీటెక్ విద్యార్థుల అదృశ్యం

- ఆచూకీ కోసం అటవీశాఖ అధికారులతో కలసి పోలీసుల ముమ్మర గాలింపు

ప్రాణాలు అడ్డుపెట్టి ఏపీఎండీసీని కాపాడుకుంటాం

- 5 డిమాండ్లతో కార్మికుల సమ్మె సైరన్

వివరాలు....6లో

చేనేత కార్యాలయంలో సిబ్బంది లేక ఖాళీగా ఉన్న కుర్చీలు



తాళాలు ఎప్పుడు తీస్తారో..?

- ఆ కార్యాలయంలో కనిపించని సిబ్బంది
- క్యాంపుల పేరుతో కార్యాలయానికి దూరం..
- ఉన్నది ఇద్దరే..
- హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్ కార్యాలయం తీరు

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్ కార్యాలయంలో ఉన్నది ఇద్దరే. వారు కార్యాలయానికి ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళతారో ఎవరికీ తెలియదు. ఆ కార్యాలయానికి ఎప్పుడూ తాళం వేసే ఉంటుంది. క్యాంపుల పేరుతో అసలు కార్యాలయం చుట్టుపక్కలకే రాకుండా ఒకే ఒక అటెండర్‌ను అక్కడ కూర్చోబెట్టి వారు ఇతర కార్యక్రమాల్లో బిజీగా ఉన్నట్లు తెలిసింది. కొత్త జిల్లా ఏర్పాటై దాదాపు మూడు సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటికీ కొన్ని కార్యాలయాలను సిబ్బంది కొరత పట్టి పీడిస్తోంది. అంతేగాకుండా ఉన్న సిబ్బంది కూడా సమయానికి రాకుండా క్యాంపుల పేరుతో బయటే తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండటం లేదన్న విమర్శలు వస్తున్నాయి. హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్, సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్, సబార్డినేట్, టైపిస్టు, ఇద్దరు అటెండర్లు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఏడీతో పాటు సీనియర్ అసిస్టెంట్, ఒక అటెండర్ మాత్రమే ఉన్నారు. ఆ ఇద్దరు కూడా క్యాంపులకు వెళుతుండటంతో కార్యాలయానికి తాళాలు వేసి అటెండర్ బయట కూర్చుని ఉంటున్నాడు. జిల్లా ఏర్పాటు చేసిన కొత్తలో అన్ని శాఖల అధికారులను పాత జిల్లాల నుంచి కొత్త జిల్లాలకు కేటాయించారు. అయితే వారిలో కొంతమంది మాత్రమే ఇక్కడికి వచ్చి ఉద్యోగం చేస్తున్నారు. మిగిలిన వారు పాత జిల్లాలు వదిలి రాలేమంటూ అక్కడే విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కొత్త జిల్లాకు అధికారులను పూర్తి స్థాయిలో నియమించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్స్ ఏడీ బి.క్రిష్ణను వివరణ కోరగా మేము బయట క్యాంపుల్లో ఉన్నాము. కనుక కార్యాలయంలో ఎవ్వరూ లేరు. ముద్ర లోన్స్ విషయంలో బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నాము. అందువల్లనే కార్యాలయంలో కూర్చోలేకపోతున్నామని ఆయన తెలిపారు.



రెండు రూములకు తాళమే తీయని వైనం

అద్దె చెల్లిస్తారా.. తాళం వేయమంటారా..?

- జిల్లాలో పేరుకుపోతున్న సచివాలయాల అద్దెలు
- రూ.60లక్షల మేర బకాయిలు
- తెగేసి చెబుతున్న అద్దె భవన యజమానులు



మదనపల్లె పట్టణం ఎన్‌వీఆర్ లేఅవుట్‌లో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న వార్డు సచివాలయాలు

మదనపల్లె, జనవరి 3: జిల్లాలో మొత్తం 501 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 414, పట్టణ ప్రాంతాల్లో 87 సచివాలయాలు ఉన్నాయి. మొత్తమ్మీద 82 గ్రామ, వార్డు సచివాలయాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. వీటికి స్క్వేయర్ యార్డు రూ.6 నుంచి రూ. 10చొప్పున భవనం విస్తీర్ణాన్ని బట్టి గ్రామీణ ప్రాంతాల్లో రూ.10వేల నుంచి రూ.15 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.10వేల నుంచి రూ.20వేలకు బాడుగ చెల్లిస్తున్నారు. ఇది కూడా నెలనెలా సక్రమంగా చెల్లించడం లేదు. అదే ప్రైవేటు వ్యక్తులకు బాడుగకు ఇస్తే.. అడ్వాన్సుతో పాటు నెలవారి క్రమం తప్పకుండా డబ్బులు వస్తా యని వారు వాపోతున్నారు. గ్రామాలు, వార్డుల వారీగా తీసుకుంటే ఆరు నెలలుగా బాడుగలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇలా జిల్లా వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాలకు కలపి సుమారు రూ.60లక్షలు మేర బకాయి ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఒక్కోసారి రెండుమూడు నెలలకు చెల్లిస్తే.. తర్వాత అయిదు నుంచి ఆరు నెలలు ఆ ప్రస్తావన ఉండదని, అద్దెలపై ఆధార పడి జీవించే తమ పరిస్థితి ఏంటని కొందరు భవన యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలోనే అధికంగా మదనపల్లె మున్సిపాలిటీలో మొత్తం 44 వార్డు సచివాయాలు ఉండగా, 23 అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. వీటికి నెలకు రూ.3లక్షల చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. ఇప్పటి వరకు ఆరు నెలల బకాయిలు ఉన్నాయి. అలాగే జిల్లా కేంద్రం రాయచోటిలో 25 వార్డు సచివాలయాలు ఉండగా, 22 కార్యాలయాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఇక్కడ కూడా ఆరు నెలలుగా రూ.10లక్షల మేర బకాయిలు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. రాజంపేట మున్సిపాలిటీలో 13 వార్డు సచివాలయాలు ఉండగా, ఏడు భవనాలు అద్దెవే ఉన్నాయి. అలాగే జిల్లాలోని 30 మండలాల్లో మదనపల్లె డివిజన్‌లో ఏడు, రాయచోటి డివిజన్‌లో ఆరు, రాజంపేట డివిజన్‌లో పదిహేను గ్రామ సచివాలయాలు కలిపి మొత్తం 28 అద్దెభవనాల్లో నిర్వహిస్తున్నారు. వీటిన్నింటికి కలిపి రూ.60 లక్షలు మేర బకాయిలు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. సచివాలయ యజమానులకు చెల్లించాల్సిన అద్దెలను వారి పేరున సీఎఫ్ఎంఎస్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేస్తున్నామని, ప్రభుత్వం నిధులు విడుదల చేయ గానే, వారి వారి ఖాతాలకు జమ అవుతుందని అటు జిల్లా, ఇటు మున్సిపల్ అధికారులు చెబుతున్నారు.

ఉదాహరణకు తీసుకుంటే..

మదనపల్లె పట్టణం బసినికొండ, ఎన్‌వీఆర్ లేఅవుట్‌లోని 11, 12 వార్డులోని సచివాయాలు ఎన్‌వీఆర్ లేఅవుట్‌లో పక్కపక్కనే రెండు బిల్డింగ్‌ల లో నిర్వహిస్తున్నారు. ఇందులో ఒక యజమాని ఆరునెలలుగా అద్దె చెల్లించలేదని.. వెంటనే చెల్లించాలని లేకుంటే తాళం వేస్తామని సూచిస్తున్నా రు. ఇప్పటి వరకూ రావాల్సిన అద్దె బకాయిలు చెల్లించి భవనాన్ని ఖాళీ చేయాలని డిమాండ్ చే స్తున్నారు. ఈ మేరకు సచివా లయంలోని అడ్మిన్ సెక్రటరీ, మున్సిపల్ కమిషనర్‌కు సూచిస్తున్నారు. అద్దెల చెల్లింపుల విషయంలో తామేమీ చేయలే మని, ప్రభు త్వం నుంచి నిధులు రాగానే బ్యాంకు ఖాతాలో పడతాయని చెబుతున్నారు. నెలరోజుల్లో కార్యాలయాన్ని ఖాళీ చేయాలని, అది కూడా మొత్తం బకాయిలు క్లియర్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అసలే తాము అప్పట్లో తక్కువ ధర కే అద్దెకు ఇచ్చామని, పక్కనే ప్రైవేటు భవనాలకు ఎక్కువ అద్దె చెల్లిస్తున్నట్లు చెబుతున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే టూలెట్ బోర్డు ఏర్పాటు చేసి, ఆ దిశగా అధికారులను అప్రమత్తం చేశారు. ఈయన ఒక్కరే కాదు.. చాలాచోట్ల ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అయితే కొందరు వార్డు, గ్రామ అడ్మిన్ సెక్రటరీ యజమానులకు నచ్చచెప్పి సర్దుబాటు చేస్తుండగా, మరికొందరు అడ్మిన్ సెక్రటరీలు బాడుగలు ముందుగానే చెల్లించి, తర్వాత ప్రభుత్వం నుంచి తీసుకుంటున్న సందర్భాలూ ఉన్నాయి.

గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకువస్తామంటూ గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చింది. అయితే అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేయడంలో విఫలమయ్యింది. ఐదేళ్ల పాలనలో వార్డు, గ్రామ సచివాలయాలకు సొంత భవనాలు నిర్మించలేకపోయింది. పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో సచివాలయ నిర్మాణాలు చేపట్టగా, కొన్ని పూర్తికాగా, మరికొన్ని వివిధ కారణా లతో అర్థాంతరంగా ఆగిపోయాయి. దీంతో చాలావరకు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఇప్పుడు వీటి అద్దెల భారం తడిసిమోపడవుతోంది. ఈ క్రమంలో ఇప్పటి వరకు ఆరు నెలలుగా అద్దెలు చెల్లించకపోవడంతో కొందరు యజమానులు తాళం వేయడానికి సిద్ధపడుతున్నారు. ఇప్పటికి రావాల్సిన బకాయిలు చెల్లించి వెంటనే ఖాళీ చేయాలని తెగేసి చెబుతున్నారు. రెండున్నరేళ్లుగా అద్దెలు పెంచ లేదని, అప్పటి నుంచీ ఇప్పటి వరకూ ఒకే మొత్తాన్ని చెల్లిస్తుండటాన్ని ఆక్షేపిస్తున్నారు. అదే మున్సిపాలిటీ గదులకు అయితే మాత్రం.. మూడేళ్లకోసారి రెన్యువల్ చేయడంతో పాటు 33శాతం అద్దెలు పెంచి అమలు చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు.



టులెట్ బోర్డు ఏర్పాటు చేసిన యజమాని

మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులకు పీఈటీ పరీక్షలు

- 713 మందికి గాను 345 మంది హాజరు



కడప క్రైం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్టైపెండరీ మహిళా పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాలకు ప్రాథమిక రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు పీఎంటీ మరియు పీఈటీ పరీక్షలను శుక్రవారం నిర్వహించామని ఇన్‌చార్జి ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. 713 మంది హాజరు కావాల్సి ఉండగా 345 మంది మహిళా అభ్యర్థులు హాజరయ్యారన్నారు. 195 మంది క్వాలిఫై అయ్యారన్నారు. నియామకాల ప్రక్రియ వేకువజామున 5గంటల నుంచే ప్రారంభం అయిందన్నారు. మహిళా అభ్యర్థులకు పీఎంటీ మరియు పీఈటి పరీక్షలు నిర్వహించేందుకు ప్రత్యేకంగా మహిళా పోలీసు సిబ్బందిని నియమించామని ఎస్పీ తెలిపారు. అభ్యర్థులకు ముందుగా హాల్‌టికెట్స్ పరిశీలించి డీటీసీ గ్రౌండులోకి అనుమతించారు. అనంతరం అభ్యర్థుల విద్యార్హతలు, రిజర్వేషన్లు, వయసు నిర్ధారించే ధ్రువపత్రాలు పరిశీలించి అన్నీ సక్రమంగా ఉన్న వారివి మాత్రమే బయోమెట్రిక్ తీసుకుని పీఎంటీ పరీక్షలకు అనుమతించామన్నారు. ఈ ప్రక్రియలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ రమణయ్య, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

వామ్మో... స్మార్ట్ మీటర్


- ఆర్ఓ ప్లాంటుకు ఒకేసారి పదిరెట్లు విద్యుత్ బిల్లు
- లబోదిబోమంటున్న బాధితులు

7



ఫ్రాడ్ కాల్.. రూ.50 లక్షలు ఇవ్వాలని బెదిరింపు

- పోలీసులకు ఎంఈవో ఫిర్యాదు



వాల్మీకిపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల మోసాలు, బెదిరింపులు రోజు రోజుకు పెరిగి పోతున్నాయి. ఈ నేపథ్యంలో వాల్మీకిపురం ఎంఈవో వెంకటరత్నంకు సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి డబ్బులు ఇవ్వాలని బెదిరించడంతో సీఐ ప్రసాద్‌బాబుకు ఫిర్యాదు చేశారు. గత రెండు రోజులుగా ఎంఈవో వెంకటరత్నంకు వాట్సాప్ ఫోన్ కాల్స్ ద్వారా తాను కర్ణాటక పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్ అని.. నీ ఆధార్ కార్డుతో మరొకరు సిమ్‌కార్డు పొంది ఓ అమ్మాయిని ఫోన్ కాల్స్ ద్వారా వేధిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేశామని.. తక్షణం సంప్రదించకపోతే జైలుకు పంపుతామని బెదిరించారు. మళ్లీ తిరిగి శుక్రవారం ఉదయం వాట్సప్ ద్వారా వీడియో, వాయిస్ కాల్స్ వచ్చాయి. తక్షణం రూ.50 లక్షలు సిద్ధం చేసుకుని తమకు అందజేయని పక్షంలో అరెస్టు చేసి తీసుకెళ్తామని ఫోన్ కాల్స్ రావడంతో దిక్కు తోచని స్థితిలో ఆయన సీఐ ప్రసాద్‌బాబును ఆశ్రయించారు. ఇందుకు స్పందించిన సీఐ సైబర్ నేరగాళ్ల నుంచి ఇలాంటి ఫ్రాడ్ కాల్స్ వస్తే బ్లాక్ లిస్టులో పెట్టి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఆందోళన చెందవద్దని ఎంఈవో వెంకటరత్నంకు ధైర్యం చెప్పి భరోసా కల్పించారు. అనంతరం సీఐ విలేకరులతో మాట్లాడుతూ సైబర్ నేరస్తులు కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారని... ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రామానాయుని చెరువులో చైర్మన్‌తో వాదిస్తున్న ఇసుకాసురులు



చైర్మన్ వర్సెస్ ఇసుకాసురులు

- ఇసుక అక్రమరవాణాను అడ్డుకున్న చైర్మన్
- రామానాయునిచెరువులో ఉద్రిక్తత

గుర్రంకొండ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): చెరువు నుంచి అక్రమంగా ఇసుకను ఎలా తరలిస్తారంటూ సాగునీటి సంఘం చైర్మన్ కృష్ణారెడ్డి, కుమారుడు వేణుగోపాల్‌రెడ్డిలు ఇసుకాసురులను అడ్డుకున్నారు. దీంతో రామానాయునిచెరువులో శుక్రవారం ఉదయం కొంతసేపు ఉద్రికత్త నెలకొంది. చెరువులో ఉన్న ఇసుకను కొందరు ఇసుకాసురులు ఆదాయవనరుగా మార్చుకున్నారు. ఈ క్రమంలో ప్రతి రోజు పదుల సంఖ్యలో ఇసుకను ట్రాక్టర్లలో బయట ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీంతో చెరువులో ఇసుకను స్థానిక అవసరాల కోసం వినియోగించుకోవాలని సాగునీటి సంఘం చైర్మన్ ఇసుకాసురులకు చెప్పాడు. ఇసుకను బయట ప్రాంతాలకు తరలించడానికి వీలులేదంటూ ట్రాక్టర్లను అడ్డుకున్నారు. సాగునీటి సంఘం చైర్మన్‌కు ఇసుకాసురులకు మధ్య మాటల యుద్ధం జరిగింది. ఈ క్రమంలో వీరి మధ్య గొడవ చోటుచేసుకొనే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో సమాచారాన్ని చైర్మన్ పోలీసులకు తెలపడంతో పోలీసులు చెరువు వద్దకు చేరుకొని అక్రమంగా ఇసుక తరలి స్తున్న ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ట్రాక్టర్లలోని ఇసుకను చెరువు వద్దనే దింపేసి ఖాళీ ట్రాక్టర్లను పంపారు. అనంతరం ఇరువర్గాలకు సర్దిచెప్పి పంపారు.

ఇసుక తరలింపును అడ్డుకున్న రైతులు



పిచ్చలవాండ్లపల్లె వద్ద ఇసుక నిల్వల తరలింపును అడ్డుకున్న రైతులు

కురబలకోట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిచ్చలవాండ్లపల్లె పంచాయతీ సమీపంలో నిర్మిస్తున్న రిజర్వాయర్ వద్ద నిల్వ ఉంచిన భారీ ఇసుక నిల్వలను కొంతమంది తరలించేందుకు ప్రయత్నించగా గ్రామస్థులు శుక్రవారం అడ్డుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.759.50 కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టు నిర్మాణ పనులను చేపట్టారు. అయితే ఈ ప్రాజెక్టు పనులు దాదాపుగా 80శాతం పూర్తి చేశారు. అయితే పర్యావరణ అనుమతులు లేవని కోర్టును ఆశ్రయించడంతో ప్రాజెక్టు నిర్మాణ పనులను నిలిపివేయాలని ఆదేశించింది. దీనిపై కోర్టులో కేసు నడుస్తుంది. ఈ నేపథ్యంలో కోర్టులో కేసు ముగిసేవరకు ఇక్కడ ఉన్న వాటిని తరలించకుడదని ఆదేశించింది. అయితే కొంతమంది మైనింగ్ అధికారుల నుంచి అనుమతులు పొంది ఇసుకను తరలించేందుకు ఎక్స్‌కవేటర్‌తో పాటు టిప్పర్‌లను అక్కడికి తీసుకెళ్లారు. అయితే గ్రామస్తులకు విషయం తెలియడంతో తమకు భూ పరిహారం చెల్లించే వరకు తరలించరాదని అడ్డుకున్నారు. ఈ విషయాన్ని రెవెన్యూ, మైనింగ్ అధికారుల దృష్టికి వెళ్లగా వారు అక్కడి చేరుకుని విచారించారు. కాగా కోర్టులో కేసు ఉండటంతో తరలించరాదని రెవెన్యూ అధికారులు తెలియజేయడంతో వెనుదిరిగి వెళ్లారు. కార్యక్రమంలో తహశీల్దార్ తపస్విని, ఆర్ఐ బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

మూఢ విశ్వాసాలపై సమరం



చేతులకు మంటలు అంటించుకుని విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పల్లవోలు రమణ

- కుల నిర్మూలనతోనే అసమానతల తొలగింపు
- శాస్త్రీయ దృక్పథంతో ప్రజల్లో చైతన్యం
- నాస్తిక సమాజం జిల్లా కన్వీనర్ పల్లవోలు రమణ
- నేడు, రేపు విజయవాడలో ప్రపంచ నాస్తిక మహాసభలు



ప్రొద్దుటూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అతను బాల్యంనుంచే ప్రజా నాట్యమండలి కళాకారుల వెంట తిరుగుతూ పాటలు పాడటం నేర్చుకున్నాడు. హైస్కూలు స్థాయి నుంచే కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాల్లో కార్యకర్తగా పనిచేస్తూ కళాకారుడుగా గాయకుడుగా ఎదిగాడు. ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడిగా సైతం పనిచేశాడు. సీపీఐలో పనిచేసేటప్పుడు మనుషుల మధ్య ఉండే ఆర్థిక అసమానతలు తొలగిపోయే పోరాటాలపై చైతన్యం పెంపొందించుకున్నాడు. మూఢనమ్మకాలను అంధవిశ్వాసాలను మనుషుల అంతరాల్లోంచి తొలగించనిదే మనిషి మానవీయంగా ఎదగడని అర్థం చేసుకున్నాడు. తాను నాస్తికునిగా హేతువాదిగా మారాడు. విద్యార్థుల్లో, ప్రజల్లో శాస్త్రీయ భావాలు పెంపొందించేందుకు మూఢనమ్మకాలను అంధవిశ్వాసాలను పారదోలేందుకు కంకణం కట్టుకున్నాడు. ఆయన పేరే కటారు వెంకటరమణ అలియాస్ పల్లవోలు రమణ. విజయవాడలో శని, ఆదివారాల్లో ప్రపంచ నాస్తిక మహాసభలు జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి వెళుతున్న జిల్లా నాస్తిక సమాజం కన్వీనర్ పల్లవోలు రమణ ప్రస్థానం గురించి.. ఆయన మాటల్లోనే..

ఆదెమ్మ పాటలతో..

మాది మైదుకూరు నియోజకవర్గం చాపాడు మండలం పల్లవోలు గ్రామం. మాది వ్యవసాయ కుటుంబం. నా చిన్నతనం నుంచి మావూర్లో కమ్యూనిస్టు పార్టీ కమిటీ ఉండేది. మానాన్న వెంకటయ్య ఆ పార్టీలో కార్యకర్తగా ఉండేవాడు. నాకు పది పన్నెండేళ్ల వయసులో మైలవరం వద్ద ఏఐవైఎఫ్ శిక్షణా తరగతులు జరుగుతుంటే మా వూరిలోని ఆదెమ్మ అక్కడికి వంట చెయ్యడానికి వెళ్లింది. అక్కడ ఆమె ప్రజానాట్యమండలి వాళ్ల పాడిన పాటలు విని వచ్చి మాకు వినిపించింది. ఆ పాటలు నన్ను ఆకర్షించాయి. నేను మొట్టమొదట విన్నది నేర్చుకున్నది "సుత్తి కొడవలి గురుతుగ ఉన్న ఎర్రని జెండా ఎగురుతున్నది" అనే పాటను. ప్రజా నాట్యమండలి వాళ్లపాడే పాటలకు ఆకర్షితుడినై నేను డప్పు కొట్టి పాటలు పాడటం మొదలుపెట్టాను. నాతోపాటు నా సోదరులు వెంకటేశ్వర్లు గంగయ్య పాటలు పాడేందుకు వచ్చేవారు. ఆ క్రమంలో కటారు దళంగా జిల్లాలో పేరు తెచ్చుకున్నాం. పాటలు పాడే రమణ నుంచి పల్లవోలు రమణగా పేరు వచ్చింది.

కమ్యూనిస్టుగా..

కమ్యూనిస్టు పార్టీలో చిన్నప్పటి నుంచి సభ్యుడిగా ఉన్నాను. ఏటుకూరి బలరామమూర్తి సురవరం సుధాకర్‌రెడ్డి, నల్లమల్ల గిరిప్రసాద్, శివరామిరెడ్డి లాంటి వాళ్లక్లాసులు విన్నాను. కానీ నాకు ఆ పార్టీ సిద్ధాంతాలు, రాజకీయాలు పెద్దగా బోధపడలేదు. అంతేకాక నిత్య జీవితంలో ఎదురయ్యే దేవుడు దయ్యం మూఢనమ్మకాలు అంధవిశ్వాసాలపై సీపీఐలో చెప్పలేదు. పేదల పక్షం ఉండే పార్టీగా మాత్రమే తెలుసు. నేను కొంతకాలం పత్రికల్లో చాపాడు మండల కంట్రిబ్యూటర్‌గా పనిచేశాను. ఆ తరువాత వ్యవసాయం చేశాను. వ్యవసాయ బోర్లు వేసే పనికి పోతూ బోర్లు వేసే మేస్త్రీగా ఎదిగాను. బోర్లు వేసే క్రమంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో అనేక గ్రామాలు తిరిగాను. మా వూర్లో మనుషుల మధ్య ఉండే కులవివక్షను గమనించాను. ఎంపీటీసీగా గెలిచిన ఒక దళితురాలు మావూర్లో పెళ్లిళ్లలో ఎంగిలి విస్తర్లు ఎత్తేది. ఈ సంఘటనలన్నీ నాలో కుల వివక్షను గురించి ఆలోచింపచేసేవి.

నాస్తిక సమాజం పరిచయంతో..

పదేళ్లక్రితం సోషల్ మీడియా ద్వారా భారత నాస్తిక సమాజం పరిచయమయింది. ఆ సంస్థ నాయకుడు జీడీ సారయ్యతో సంబంధాలు ఏర్పరుచుకున్నాను. అక్కడి నుంచి నేను అప్పటి వరకు నాస్తిక, హేతువాద భావాలు తెలుసుకోవడం మూఢనమ్మకాలపై అవగాహన పెంపొందించుకోవడం ప్రారంభించాను. కులం మతం దేవుడు దయ్యం సంప్రదాయాలు కట్టుబాట్ల నుంచి అతన్ని చైతన్య పరచాలంటే కచ్చితంగా సామాజిక చైతన్యం అందించాలి. మనం కూడా నిత్యం జీవితంలో సంఘర్షణపడాలి.

పెరియార్ ఆలోచనావిధానం

తమిళనాడు రాష్ట్రం చెన్నైలో ద్రవిడ కజకం వారు జరిపిన అంబేద్కర్ 125 జయంతికి వెళ్లాను. అక్కడ తాళి తెంచి భర్త చేతిలో పెట్టే ఒక చైతన్య కార్యక్రమం ద్రవిడ ఉద్యమనాయకుడు వీరమణి ఆధ్వర్యంలో జరిగింది. అప్పుడు నేను తాళి అనేది స్త్రీకి ఒక బంధనం లాంటిదని అవగాహన పెంపొందించుకున్నాను. ఆ తరువాత ప్రపంచ నాస్తిక మేళా తిరుచురాపల్లిలో జరిగింది. అక్కడికి వెళ్లి పెరియార్ ఆలోచనా విధానాన్ని అర్థం చేసుకున్నాను. అప్పటి నుంచే నేను పూర్తిగా నాస్తికునిగా మారాను. గుంటూరు జిల్లా నిడమర్రులోని చార్వాక ఆశ్రమంలో హేతువాద సభలకు ప్రతి ఏడాది వెళ్లి అక్కడ జరిగే సమ్మేళనంలో పాల్గొనడం ద్వారా ఇతర రాష్ట్రాలలో ఉండే హేతువాద నాస్తికవాదులు పరిచయమయ్యారు. అలాగే కులనిర్మూన సంఘం వారు పరిచయం కావడంతో కుల అసమానతలు రూపుమాపందే సమాజంలో నిజమైన సమానత్వం రాదని గ్రహించాను. అది నా ఇంటినుంచే ప్రారంభించాలని నా కూతురు భారతీకి కులాంతర వివాహం చేశాను. తాళి తలంబ్రాలు లేకుండా నిరాడంబరంగా పెళ్లిచేశాను. నా కుమారుడు సాయి కూడ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ చదివాడు. అతన్ని నాస్తిక భావాలతోనే పెంచాను.

మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా...

మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు కళాశాలల్లో విస్తృతంగా ప్రచారం చేశాము. ముఖ్యంగా బాబాల ముసుగులో వారు చేసే మాయలు మంత్రాలలోని లోగుట్టులను బహిర్గతం చేసేవాళ్లం. చేతిలోనించి విభూదిని తీసే టెక్నిక్ చూపించే వాళ్లం. చేతులు కాలకుండా మంటలు ఎలా మండించాలో పిల్లలకు నేర్పించాం. గాలిలో మంటలు మండించడం నోట్లో నుంచి మంటలు బయటికి తీయడం లాంటివి మనకు అద్భుతంగా కనిపించే ప్రతిచర్య వెనుక ఒక శాస్త్రీయమైన విధానం ఉంటుందని బోధించాం. నిప్పుల్లో నడవడం, మ్యాజిక్‌లు చేసి చూపడం లాంటివి చేసి ప్రజల్లో మూఢనమ్మలపై విశ్వాసం తొలగించే ప్రయత్నాలు చేపట్టాం. ప్రముఖులైన హేతువాదులు సామాజికవేత్తలను పిలిపించి సభలు సమావేశాలు చర్చలు గోష్ఠులు నిర్వహించాం. జీడీ సారయ్య, బాబు గోగినేని, కదిరే క్రిష్ణ, పెన్మత్స సుబ్బరాజు, డాక్టర్ బ్రహ్మారెడ్డి, ప్రొఫెసర్ కాసీం తదితరులు మేము నిర్వహించే కార్యక్రమాలకు వచ్చారు.

సామాజిక సేవాకార్యక్రమాలు

మా అమ్మ లక్షుమ్మ మరణం తరువాత ప్రతి ఏడాది దినకర్మలు చేయడం కాకుండా ఆమె మరణించిన రోజున రక్తదాన శిబిరాలు ఏర్పాటుచేశాం. స్వయంగా నేనే 25 సార్లు రక్తదానం చేశాను. మాకు తెలిసిన వాళ్ల ఎవరు మరణించినా వారి కుటుంబాలకు నేత్ర దానంపై అవగాహన కల్పించి వారి కార్నియా దానం చేసేలా కృషి చేస్తున్నాం. అలాగే శరీరదానం నేత్రదానంపై కూడా కాలేజీల్లో అనేక చోట్ల ప్రచారం చేస్తున్నాం. వారిచేత అంగీకార పత్రాలు రాయిస్తున్నాం. తెలిసిన వారు మరణిస్తే వారి శరీరాన్ని దానం చేసేలా వారి కుటుంబ సభ్యులను ఒప్పించి శరీర దానం కార్యక్రమాలను కూడా చేస్తున్నాం.

పాటల ద్వారా ప్రజల్లో చైతన్యం

నాకు ఎలాంటి డిగ్రీ చదువులు లేవు. నా పాఠశాల, ఇంటర్ విద్య కూడా సక్రమంగా సాగలేదు. నేను పెద్ద ఉపన్యాసకున్ని, రచయితను కాదు. కానీ గాయకుడిని. పాటలు పాడటం ద్వారా సామాన్య ప్రజల్లో చైతన్యం రగిలించవచ్చనే నమ్మకం కలిగినవాడిని. అందుకే సమాజంలో ఉండే ఈ సాంఘిక దురాచారాలు, మూఢనమ్మకాలు, అంధవిశ్వాసాలు, కుల అసమానతలు కులపీడన కుల దోపిడీ పోవాలని అప్పుడే నిజమైన మార్పు వస్తుందని బలంగా విశ్వసించే వ్యక్తిని. నా శక్తి మేరకు భారత నాస్తిక సమాజం ద్వారా ఇతర విప్లవ ప్రజా సంఘాల సహకారంతో సామాజిక చైతన్యం పెంపొందించే కార్యక్రమాలు చేపడుతున్నాను.

పల్లవోలు రమణ యూట్యూబ్

'పల్లవోలు రమణ' పేరుతో యూట్యూబ్ చానల్ సైతం నిర్వహిస్తున్నాను. సామాజిక చైతన్యం పెంపొందించే సామాజిక మార్పుకోసం పనిచేసే అనేక సంఘాల సభల కార్యక్రమాలు, ఉపన్యాసాలు, ప్రముఖుల ఇంటర్వ్యూలు మా చానల్ ద్వారా ప్రసారం చేస్తున్నాం.

సచివాలయాన్ని తనిఖీ చేసిన డీపీవో

పెండ్లిమర్రి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెండ్లిమర్రి గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఉదయం కడప జిల్లా పంచాయతీ అధికారిణి రాజ్యలక్ష్మి అకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మండల కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు గ్రామంలో వాటర్ క్లోరినేషన్, ట్యాంక్ క్లీనింగ్, పంచాయతీ పన్ను వసూళ్ల తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో వాటర్ క్లోరినేషన్ తప్పనిసరిగా చేయించాలన్నారు. వాటర్ ట్యాంక్‌ను శుభ్రపరిచి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్నారు. పచాయతీలోని అన్ని ఇళ్లకు షాపులకు పన్ను వసూలు వందశాతం పూర్తయ్యేలా చూడాలన్నారు. అలాగే వర్మీకంపోస్టు ఎరువులు తయార్యేలా కృషిచేయాలని, పంచాయతీకి ఆదాయం వచ్చేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శివరాం రెడ్డి, గ్రామసర్పంచు నాగమల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

థింక్ రోడ్డు సేఫ్టీ పోస్టరు ఆవిష్కరించిన మంత్రి



కడప క్రైం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ చేతుల మీదుగా థింక్ రోడ్డు సేఫ్టీ పోస్టరు ఆవిష్కరణ జరిగిందని జిల్లా రోడ్డు సేఫ్టీ ఎన్‌జీవో అధ్యక్షుడు జి.రమణ పేర్కొన్నారు. మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్టు వారి అబ్జర్వెన్సీ ఆఫ్ రోడ్ సేఫ్టీ మంత్-2025లో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన కల్పించాల్సి ఉందని, ఈ కార్యక్రమంలో ఎన్జీవో సంస్థలు భాగస్వామ్యం కావాలని కోరారన్నారు. దీంతో రోడ్ సేఫ్టీపై ఎన్‌జీవో జిల్లా కమిటి తరఫున ప్రచార బోర్డులు తయారు చేశామన్నారు. వాహనడ్రైవర్లు రోడ్డుభద్రతా సూచనలు తప్పక పాటించాలని, హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడపాలని అన్నారు. ఆ మేరకు పోస్టర్లు తయారు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రోడ్డు సేఫ్టీ ఎన్‌జీవో రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఆర్.బంగారయ్య పాల్గొన్నారు.

ఆల్ ఇండియా క్యారమ్స్ పోటీలకు అంపైర్‌గా సురే కృష్ణయ్య



నందలూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో 5 నుంచి 8వ తేదీ వరకు జరిగే ఆలిండియా క్యారమ్స్ పోటీలకు అంపైర్‌గా నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సురే కృష్ణయ్య ఎంపికైనట్లు రాష్ట్ర క్యారమ్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎస్‌కే జలీల్, కడప జిల్లా క్యారమ్స్ చైర్మన్ పోలంకి గణేష్ తెలిపారు. మొట్ట మొదటిసారిగా జాతీయ క్యారమ్స్ పోటీలకు అంపైర్‌గా ఎంపిక కావడం ఉమ్మడి కడప జిల్లాకు, క్యారమ్స్ సంఘానికి గర్వకారణమని పలువురు ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు

పదేళ్లతరువాత హంద్రీ-నీవా బకాయిల విడుదల

కలికిరి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా పథకానికి సంబంధించి మదనపల్లె ఫేజ్-2లో 65వ ప్యాకేజీకి దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న రూ.52 లక్షల బకాయిని కూటమి ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. ఈ ప్యాకేజీకి సంబంధించిన గుర్రంకొండ మండలం ఎల్లుట్ల వద్ద ప్రతిపాదించిన డిస్ట్రిబ్యూటరీ సిస్టం కింద 15,400 ఎకరాల ఆయకట్టు లక్ష్యంగా 22 కిలోమీటర్ల పొడవునా చేసిన వివిధ రకాల పనులకు సంబంధించి రూ.52,28,324లు ప్రభుత్వం బకాయి పడింది. 2013 ఏప్రిల్-నవంబరు మధ్య ఈ పనులు జరిగాయి. అన్ని చెల్లింపులు పోనూ సాంకేతిక కారణాలతో ఈ మొత్తం ఆగిపోయింది. రాష్ట్ర స్థాయిలో ఏర్పాటయిన స్టేట్ లెవెల్ టెక్నికల్ కమిటీ (ఎస్‌ఎల్‌టీసీ) 2021 ఆగస్టు 12న సమావేశమై గతంలో నిలిచిపోయిన బకాయిలు చెల్లించాలని తీర్మానం కూడా చేసి ప్రభుత్వానికి ప్రతిపాదించింది. అయినా అప్పటి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. మొత్తం వ్యవహారాన్ని సమగ్రంగా క్రోడీకరిస్తూ తిరుపతి ఎన్టీఆర్ తెలుగుగంగ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీరు గత సెప్టెంబరులో నిధుల విడుదల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. పరిశీలించిన ప్రభుత్వం బకాయి నిధుల విడుదల కోసం ఆమోదం తెలిపింది. ఈ మేరకు రూ.52,28,324లు విడుదల చేస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రాణాలు అడ్డుపెట్టి ఏపీఎండీసీని కాపాడుకుంటాం

- 5 డిమాండ్లతో కార్మికుల సమ్మె సైరన్

ఓబులవారిపల్లె, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రాణాలు అడ్డుపెట్టి అయినా ఏపీఎండీసీని కాపాడుకుంటామని కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. ఐదు డిమాండ్లను పరిష్కరించాలని అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ వద్ద దశలవారీగా నిర్వహిస్తున్న ఆందోళనలో భాగంగా శుక్రవారం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మిక యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఇటీవల ఏపీఎండీసీ యాజమాన్యం ఆహ్వానించిన సీ అండ్ డీ, డబ్ల్యూ గ్రేడ్ టెండర్లతో సంస్థ మనుగడకే ప్రమాదం ఏర్పడేలా ఉందన్నారు. ప్రస్తుతం సీ అండ్ డీ గ్రేడ్ టన్ను ధర రూ.1600 ఉండగా, ఏపీఎండీసీ యాజమాన్యం మాత్రం టన్నుకు కేవలం రూ.1188తో 60 లక్షల టన్నులకు టెండరు పిలవడం వెనుక అంతర్యమేమిటని ప్రశ్నించారు. దీంతో సుమారు 700 మంది కార్మికుల భవిష్యత్ అంధకారంలోకి వెళుతుందని, వెంటనే ఈ టెండరును ఆపాలని డిమాండ్ చేశారు. గ్రామ కమిటీతో చేసుకున్న ఒప్పందం ప్రకారం యాజమాన్యం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. పర్మనెంట్ ఉద్యోగులకు ప్రమోషన్, రివైజ్డ్ పే అమలు చేయాలని కోరారు. బెనిఫికేషన్ ప్లాంటు ఏర్పాటు చేసి సంస్థను లాభాల బాటలో నడిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. లాభాల సొమ్మును ఏం చేశారో చెప్పకుండా 5 వేల కోట్ల రూపాయలకు సంస్థ ఆస్తులను అమ్మాలని చూడడం దారుణమని, వెంటనే ఆ చర్యలను విరమించాలని డిమాండ్ చేశారు. 15వ తేదీలోపు సమస్యలు పరిష్కరించకుంటే 16వ తేదీన నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అన్ని యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.



ఏపీఎండీసీ పరిపాలన భవనం ముందు నల్లరిబ్బన్లతో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు

ఉచిత ఇసుక విధానం పక్కాగా అమలు చేయండి

- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప కలెక్టరేట్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానం పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నూతన ఇసుక పాలసీ, ఇసుక బుకింగ్ సరఫరా, ఇసుక లభ్యత, పట్టా ల్యాండ్స్ వంటి అంశాలపై అమరావతి నుంచి గనులు భూగర్భ శాఖ కార్యదర్శి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, గనులు భూగర్భశాఖ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గనుల భూగర్భ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేశ్ కుమార్ మీనా మాట్లాడుతూ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు సూచనల మేరకు ఉచిత ఇసుక పాలసీని మరింత మెరుగు పరచాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత ఇసుక పాలసీ, ఆన్‌లైన్, రిజిస్ట్రేషన్, శాండ్ పోర్టల్ బుకింగ్ యాప్‌పై అవగాహన పెంచాలన్నారు. సెమీ మెకనైజ్డ్ రీచ్ సమస్యలను పరిష్కరించి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఉచిత ఇసుక పాలసీ పై ప్రజల నుండి ఫీడ్‌బ్యాక్ సేకరించాలన్నారు. మాన్యువల్ రీచుల దగ్గర ఇసుక పంపిణీ సజావుగా జరగాలన్నారు. ఆయా జిల్లాలో ఇసుక ధరలను కలెక్టర్‌లు పర్యవేక్షించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పారదర్శకంగా పంపిణీ జరగాలన్నారు. సెమీ మెకనైజ్డ్ ఇసుక రీచ్‌లను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

సృజనాత్మకతమైన ఆలోచనలు చేయాలి

కడప ఎడ్యుకేషన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు భవిష్యత్తు నిర్మాణానికి పునాదులు కావాలని, సృజనాత్మకతమైన ఆలోచనలు చేయాలి కడప ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ మాధవి అన్నారు.శుక్రవారం కడప నగరం నగరపాలక ఉన్నత పపాఠశాల మెయన్‌లో జిల్లా ఇన్‌చార్జి డీఈఓ రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లాస్థాయి లకోజి సంజీవ రాయ శర్మ సైన్స్ ఫెయిర్ కార్యక్రమం నిర్వహించారు. సైన్స్ ఫెయిర్ కార్యక్రమంలో 36మండలాల నుంచి 36 వ్యక్తిగత ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించగా మరో 36 గ్రూపు మరో 36 ఉపాధ్యాయుల ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ విద్యార్థుల ఆలోచన ధోరణి సృజనాత్మక పెంపొందించే విధంగా ఉండాలని సూచించారు. ఇన్‌చార్జి విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి, డీఎస్‌ఓ ఎబినేజర్ మాట్లాడుతూ జిల్లాలోని 36 మండలాల నుంచి వ్యక్తిగత గ్రూపు ఉపాధ్యాయ విభాగాలలో ప్రాజెక్టు ప్రదర్శించారని, ఇందులో చక్కటి ప్రాజెక్టులను మొదటి రెండు స్థానాల్లో ఎంపిక చేశామన్నారు. వారు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అనంతరం సౌత్ ఇండియా లెవెల్‌లో పాండిచ్చేరిలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగమణి, డీసీఈబీ సెక్రటరీ భాస్కర్‌రెడ్డి, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్, సమగ్ర శిక్ష సెక్టోరియల్ ఆఫీసర్ కేశవరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, దశరథరామ్‌రెడ్డి, గంగాధర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, ఇన్‌చార్జి డీఈఓ రాజగోపాల్‌రెడ్డి

ఉరి వేసుకుని ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న నారాయణ

కురబలకోట, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం రాత్రి కురబలకోట మండలంలో జరిగింది. వివరాలిలా.. మండలంలోని చేనేతనగర్‌కు చెందిన ఎల్.నారాయణ(50) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటికి వచ్చి గమనించిన భార్య లక్ష్మీదేవి కేకలు వేయడంతో స్థానికులు వచ్చి అతడిని కిందకు దించారు. అప్పటికే మృతి చెందాడు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. కాగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు ముదివేడు పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని విచారించారు. ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మిద్దెపై నుంచి పడి భవన నిర్మాణ కార్మికుడి మృతి



వెంకటరమణ మృతదేహం

నిమ్మనపల్లి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మిద్దెపై నుంచి కింద పడి భవన నిర్మాణ కార్మికుడు మృతిచెందిన సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. మృతుని భార్య గంగాదేవి వివరాల మేరకు మండలంలోని బండ్లపై గ్రామంలో మూడేళ్లగా జీవనం కొనసాగిస్తున్నామని తన భర్త వెంకటరమణ(40) మేస్త్రీ పనులకు వెళ్తూ ఉండేవాడని అన్నారు. గురువారం సాయంత్రం పనులు ముగించుకుని వచ్చే క్రమంలో మిద్దెపై నుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడని అన్నారు. స్థానికులు మృతదేహాన్ని మదనపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని స్థానిక పోలీసులు తెలిపారు.

కణితి మాంసం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

కురబలకోట, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కణితి మాంసం విక్రయించేందుకు తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సెక్షన్ ఆఫీసర్ శివకుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని తెట్టు పంచాయతీ మండ్యంవారిపల్లెకు చెందిన శివ(42) స్థానిక అటవీ ప్రాంతం నుంచి కణితి మాంసాన్ని తీసుకువస్తుండగా గుర్తించామన్నారు. అతడి నుంచి మాంసాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

శేషాచలం అడవిలో బీటెక్ విద్యార్థులు అదృశ్యం

- ఆచూకీ కోసం అటవీశాఖ అధికారులతో కలసి పోలీసుల ముమ్మర గాలింపు
- మిత్రులకు లైవ్ లొకేషన్ షేర్ చేసిన విద్యార్థి

రైల్వేకోడూరు(రూరల్), జనవరి 3(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు మండలంలోని శేషాచలం అడవుల్లోని బీటెక్ విద్యార్థులు అదృశ్యమయ్యారని సమాచారం. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన ఆరుగురు బీటెక్ విద్యార్థులు అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండల పరిధిలోని శేషాచల అడవిలో ఉన్న వాగేటికోన ప్రాంతంలోని వాటర్ ఫాల్స్‌ను మరియు గుంజన వాటర్ ఫాల్స్ చూడడానికి శుక్రవారం విహారయాత్రకు వచ్చారు. వీరంతా తిరుగు ప్రయాణంలో దారి తప్పినట్లు తెలిసింది. రాత్రి కావడంతో తిరుగు ప్రయాణంలో దారి తప్పినట్లు గమనించి ఫోన్ సిగ్నల్స్ రావడంతో వారి మిత్రులకు సమాచారం అందించారు. మిత్రుల సలహా మేరకు లైవ్ సిగ్నల్స్ లోకేషన్ పంపించారు. వారందరూ అడవిలో తిరుగుతూ చివరకు రైల్వేకోడూరు అటవీ పరిధిలోని ఎస్.ఉప్పరపల్లి, ఎస్.కొత్తపల్లి ప్రాంతాల పరిధిలోకి రాగానే ఫోన్ సిగ్నల్స్ రావడంతో రేణిగుంట పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఈ మేరకు రేణిగుంట పోలీసులు కోడూరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ హేమసుందర్ రావు ఆదేశాల మేరకు కోడూరు ఎస్ఐ నవీన్ బాబు తమ సిబ్బందితో అటవీశాఖ అధికారులతో కలిసి అడవిలో జల్లెడ పడుతున్నారు. సెల్ ఫోన్ సిగ్నల్స్ అందుబాటులోకి వస్తే వారి ఆచూకీ త్వరగా లభిస్తుంది. తప్పిపోయిన విద్యార్థుల వివరాల కోసం పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది.



శేషాచలం అడవి నుంచి లైవ్ లోకేషన్ పంపిన విద్యార్థి

వామ్మో... స్మార్ట్ మీటర్

● ఆర్ఓ ప్లాంటుకు ఒకేసారి పదిరెట్లు విద్యుత్ బిల్లు
● లబోదిబోమంటున్న బాధితులు
● కెపాసిటర్ సమస్య ఉండవచ్చంటున్న అధికారులు

ఎర్రగుంట్ల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వామ్మో... స్మార్ట్ మీటర్. ఇటీవల స్మార్ట్ మీటర్ అంటేనే విద్యుత్ వినియోగదారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఎప్పుడు ఎలాంటి బాంబు పేలుస్తారనే భయంతో వణుకుతున్నారు. సాధారణ మీటర్ల నుంచి డిజిటల్ మీటర్లు, ఆపై స్మార్ట్ మీటర్ అంటూ విద్యుత్ సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వాలు వినియోగదారులపై నడ్డివిరిచే చార్జీలు వేస్తూనే ఉన్నారు. కాల్చిన యూనిట్ ధరకు తోడు ట్రూ అప్ చార్జెస్, ఏసీడీ చార్జెస్, ఇందనపు చార్జీలు, ఫిక్స్‌డ్ చార్జీలు, సర్‌చార్జీలు, ఈడీపై వడ్డీ, కస్టమర్ చార్జీలు అంటూ ఒకటేంటి ఇలా అనేక రకాల చార్జీల మోత మోయిస్తున్నారు. దీం తో వినియోగదారుడు విద్యుత్ సంస్థలు ఎప్పుడు ఏ వడ్డీ వేసి నడ్డి విరుస్తారోనన్న భయం గుప్పి ట్లో వణుకుతున్నారు. త్వరలో స్మార్ట్ మీటర్లకు ప్రీపెయిడ్ రీచార్జి సిస్టం వస్తుందన్న హాట్ టాపిక్‌తో మరింత భయపడుతున్నారు. ఇటీవల కమర్షియల్ కనెక్షన్ల మీటర్లకు స్మార్ట్ మీటర్లు అమర్చారు. అయితే వీటి వినియోగం కొన్ని చోట్ల సమస్యలు రాకపోయినా మరికొన్ని చోట్ల అధిక బిల్లులు వస్తున్నాయని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. కొందరు ఫిర్యాదులు చేస్తుండగా మరికొందరు సర్దుకుపోతున్నారు.

ఆర్ఓ ప్లాంటుకు 10రెట్ల బిల్లు...

ముద్దనూరు రోడ్డులో కోకోకోలా గౌస్ 15ఏళ్లుగా వాటర్ ప్లాంట్‌ను నడుపుతున్నారు. పెన్నా నుంచి ట్యాంకర్లతో నీటిని తెప్పించి సరఫరా చేస్తుంటాడు. అయితే ఆర్ఓ ప్లాంటుకు 4814 నెంబరుతో సర్వీసు స్మార్ట్ మీటర్‌ను ఇటీవల అమర్చారు. వేసవిలో సరాసరి బిల్లు రూ.3 నుంచి రూ.4వేలు వస్తోంది. మిగతా సమయాల్లో రూ1500 నుంచి రూ.2000 వస్తోందని యజమాని గౌస్ అంటున్నారు. స్మార్ట్ మీటర్ బిగించిన వారం తరువాత విద్యుత్ సిబ్బంది బిల్లు తీస్తే రూ.10,659 వచ్చింది. ఇదేమని విద్యుత్ సిబ్బందిని అడిగితే కెపాసిటర్ మార్చుకో వాలని సలహా ఇచ్చారు. వెంటనే ఆయన కెపాసిటర్‌ను మార్చారు. ఈ బిల్లు కట్టే లోపు డిసెంబరు 2 నుంచి జనవరి 2వరకు బిల్లు తీశారు. ఇప్పుడు ఏకంగా రూ.30909 రా వడంతో వినియోగ దారుడు ఆందోళన చెందు తున్నాడు. నవంబరు, డిసెంబరు బిల్లులు కలిపి మొత్తం రూ.41568 వచ్చింది. దీన్ని కట్టాల్సిందేనని విద్యుత్ అధికారులు పేర్కొన్నారు.


పాత మీటరు బిల్లు - స్మార్ట్ మీటర్ బిల్లులు


కొత్తగా అమర్చిన స్మార్ట్ మీటర్

15ఏళ్లలో ఎప్పుడూ రాలేదు

15ఏళ్లుగా వాటర్ ప్లాంట్‌ను నడుపుతున్నా. పెన్నా నుంచి ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసుకుని కూలింగ్ వాటర్ విక్రయిస్తున్నా. వేసవిలో ఏసీలు వేసినా 3 నుంచి 4వేలు మాత్రమే వచ్చేది. కానీ స్మార్ట్ మీటర్ ఏర్పాటు నుంచి భారీగా బిల్లు వస్తోంది. అధికారుల సలహా మేరకు వారు చెప్పిన కెపాసిటర్‌నే అమర్చాను. అయినా మళ్లీ డిసెంబరు బిల్లు ఏకంగా 31,000రావడం ఆశ్చర్యంగా వుంది. ఇంత బిల్లు కట్టే పరిస్థితి నాకులేదు. అసలే వ్యాపారాలు లేక ప్లాంటు జరగక తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నాము. గత రీడిగింగులను పరిగణలోకి తీసుకుని ఎలాగైనా బిల్లు మొత్తాన్ని తగ్గించాలని అధికారులను కోరారు.

కోకోకోలా గౌస్

పర్యవేక్షణలో ఉంచి చర్య తీసుకుంటాం

ఇలాంటివి కెపాసిటర్ సమస్యలతో వస్తాయి. దీన్ని వినియోగదారుడే చూసుకుని సరిచేసుకోవాలి. మాకు సంబంధం లేదు. అయినా కెపాసిటర్, మోటార్ పనితీరును అదే సమయంలో మీటర్ రీడింగ్‌ను గంటగంటకూ పరీక్షించి చేస్తాం. డిపార్ట్‌మెంట్ పరంగా ఎక్కడైనా సమస్య వుంటే తప్పకుండా సరిచేసి, న్యాయం చేస్తాం.

ప్రియదర్శన్‌రెడ్డి, ఏఈ డిస్కం

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ఆరు కిలోల గంజాయి స్వాధీనం

కడప క్రైం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రిమ్స్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు రిమ్స్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. సీఐ వివరాల మేరకు కడప రామక్రిష్ణా నగర్ వాసి కాకి శివ ఆలియాస్ శివమణి శుక్రవారం పాలకొండలు సమీపంలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఎస్ఐ జయరాములు సిబ్బందితో కలిసి గంజాయి విక్రయిస్తున్న శివను అరెస్టు చేసి ఆరు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఏడుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

రూ.38,450 నగదు స్వాధీనం

పులివెందుల టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పేకాడుతు న్న ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.38450 నగ దు స్వాధీనం చేసుకున్నామని పట్టణ ఎస్ఐ నారాయణ తెలిపారు. శుక్రవారం పట్టణ పరిధిలో సిబ్బందితో కలిసి తనిఖీ చేస్తుండగా పెద్దజూటూరు వద్ద జూదమాడుతున్న వారిని గమనించి వారిని అరెస్టు చేసి వారి వద్ద నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

పెండింగ్ పనులు పూర్తిచేస్తాం

జగన్ అనాలోచిత నిర్ణయంతోనే రోడ్ల దుస్థితి ● వేంపల్లెలో పనులను పునఃప్రారంభించిన బీటెక్ రవి


వేంపల్లెలో నిలిచిపోయిన రోడ్లు, డ్రైనేజీ పనులను పునః ప్రారంభిస్తున్న బీటెక్ రవి, ఈఈ మాధవి తదితరులు

వేంపల్లె, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జగన్ అనాలోచిత నిర్ణయంతోనే రోడ్ల పనులు నిలిచిపోయాయని, కూటమి ప్రభుత్వంలో పెండింగ్ పనులు పూర్తి చేస్తామని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) అన్నారు. వేంపల్లెలో వైసీపీ ప్రభుత్వం హడావుడిగా ప్రారంభించి నిలిపేసిన రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను సీఎం చంద్రబాబు హామీతో పునఃప్రారంభించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేంపల్లె, పులివెందుల, బాకరాపురం ప్రాంతాల్లో రోడ్ల దుస్థితి అధ్వాన్నంగా ఉందన్నారు. వైఎస్ జగన్ అనాలోచిత నిర్ణయం, వైసీపీ నేతల అతి విశ్వాసం, 30ఏళ్లు అధికారంలో ఉంటామన్న అహంకారంతో ఈ రోడ్ల పనులు నిలిచిపోవడానికి కారణమయ్యాయన్నారు. వేంపల్లెలో రోడ్ల పరిస్థితులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, కాంట్రాక్టర్‌కు భరోసా ఇచ్చి పనులు పూర్తిచేసేందుకు ముందుకొచ్చామన్నారు. త్వరలోనే వేంపల్లె బస్టాండ్, అలిరెడ్డిపల్లె హైలెవెల్ బ్రిడ్జిని మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్‌రెడ్డి ద్వారా ప్రారంభిస్తామన్నారు. ఆర్‌అండ్‌బీ ఈఈ మాధవి, డీఈ వేణుగోపాల్, ఏఈ మనోహర్‌రెడ్డి, టీడీపీ మండల పరిశీలకులు రఘునాథరెడ్డి, మండల కన్వీనర్ ము నిరెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి జయరామిరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, టీడీపీ యువ నేత నామా వేమకుమార్, మైనార్టీ కన్వీనర్ వలి, శేషారెడ్డి పాల్గొన్నారు.

అప్పుల బాధతో అన్నదాత ఆత్మహత్య


మహేశ్వర్ రెడ్డి మృతదేహం - ఫైల్ ఫొటో

పెద్దముడియం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో రైతు మహేశ్వర్‌రెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య స్వర్ణలత ఫిర్యాదుపై నమోదైన పోలీసు కేసు వివరాల్లోకెళితే.... కొండసుంకేసుల వాసి మహేశ్వర్‌రెడ్డి కుటుంబం వ్యవసాయం చేస్తూ జీవనం సాగించే వారు. వారికి ఉన్న 8 ఎకరాలకు తోడు మరో ఆరెకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తూ వస్తున్నారు. పంటల దిగుబడి సరిగా రాక అప్పులు పెరుగుతూ వస్తున్నాయి. ఇటీవల వచ్చిన తుపానుల ప్రభావంతో పంటలు దెబ్బతిన్నాయి. అంతేకాకుండా ప్రస్తుత తుపాను మరింత దెబ్బతీసింది. గురువారం రాత్రి భార్యతో అప్పులపై మాట్లాడాడు. భార్య సర్దిచెప్పి పిల్లలతో కలిసి ఓ గదిలో నిద్రపోగా మరో గదిలో నిద్రపో యిన మహేశ్వర్‌రెడ్డి తెల్లారే సరికి ఫాన్ కొక్కీకి శవమై వేలాడుతూ కన్పించాడు. భార్య స్వర్ణలత ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని ఆస్ప త్రికి తరలించారు.

మద్యానికి బానిసై తండ్రిని చంపిన తనయుడు

ప్రొద్దుటూరు జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన కుమారుడు మద్యం తాగటానికి డబ్బులు ఇవ్వలేదని గురువారం రాత్రి కన్నతండ్రిని హత్య చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే... ప్రొద్దుటూరు పట్టణం మోడంపల్లెలో వెంకటస్వామి (65) అనే వృద్ధుడిని ఆయన కుమారుడైన వెంకటసుబ్బయ్య మద్యం తాగటానికి డబ్బులు ఇవ్వలేదని కర్రతో తలపై మోదాడు. దీంతో తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో వెంకటస్వామి మరణించాడు. ఈ ఘటన గురువారం అర్ధరాత్రి చోటుచేసుకోగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. మృతుడు వెంకస్వామిభార్య లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

వీరారెడ్డి మృతదేహానికి నేడు శవపరీక్ష

మైదుకూరు రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు మున్సిపాలిటీలోని శెట్టివారిపల్లె గ్రామానికి చెందిన అల్లాడుపల్లె వీరారెడ్డి (75) డిసెంబరు 6వ తేదీ మృతి చెందాడు. తన తండ్రి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ మైదుకూరు పోలీసు స్టేషన్‌లో వీరారెడ్డి కుమారుడు రమేష్ ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటన మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ దృష్టికి వెళ్లింది. వెంటనే ఆయన స్పందించి వీరారెడ్డి మృతిపై వెంటనే విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీనిపై ఉన్నతాధికారులు చొరవ తీసుకొని శనివారం రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్, పోలీస్ ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో వీరారెడ్డి మృతదేహానికి శవపరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

7న కేంద్ర కరువు బృందం పర్యటన

బి.కొత్తకోట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో సాగైన పంటలకు జరిగిన నష్టాన్ని పరిశీలించేందుకు కేంద్ర కరువు బృందం ఈ నెల 7వతేదీ జిల్లాకు రానుంది. పెరీన్‌దేవి, పాలసీ అండ్ కోఆర్డినేషన్ జాయింట్ సెక్రటరీనేతృత్వంలో సుప్రియామాలిక్, అనూరాధాబటానా, ఆశిష్ పాండేలతో కూడిన కరువుబృందం బి.కొత్తకోట పరిధిలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌కు చేరుకుంటారు. రాత్రికి హిల్స్‌లో బస చేస్తారు. 8న ఉదయం 9గంటల నుంచి నిర్దేశించిన గ్రామాలలో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించి, బాధిత రైతులతో ముఖాముఖి మాట్లాడతారు. అనంతరం వ్యవసాయశాఖ, రెవెన్యూ అధికారులతో సమీక్షిస్తారు.

పరిసరాల శుభ్రతతోనే వ్యాధుల కట్టడి

కడప కలెక్టరేట్, జనవరి3 (ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రతతోనే సీజనల్ వ్యాధులను కట్టడి చేయవచ్చని జిల్లా మలేరియా అధికారి మనోరమ చెప్పారు. సీజనల్ వ్యాధులకు ప్రధాన కారణమైన దోమలను నియంత్రించడంలో భాగంగా ప్రతి ఒక్కరూ 'ఫ్రైడే డ్రైడే' పాటించాలన్నారు. నగరంలోని అబ్దుల్ నబీ వీధిలో దోమల నివారణ, మలేరియా, డెంగ్యూ, గున్యా వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. అప్పర్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేశారు.

నేడు వెంకటేశ్వరస్వామి కల్యాణం

సుండుపల్లె, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సుండుపల్లె చెన్నకేశవ, విరూపాక్షస్వామి ఆలయ ఆవరణలో ఈ నెల 4న (శని వారం) శ్రీదేవి, భూదేవి వెంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు గోవింద మాల దారులు తెలిపారు. శనివారం ఉదయం అభిషేకం, కుంకుమార్చన 10.45 నుంచి కల్యాణోత్సవం నిర్వహి స్తున్నామని వివరించారు. ఈ నెల 6న శివాలయం నుంచి సుమారు 1000 మందితో తిరుమల మహా పాదయాత్ర ప్రారంభమవుతుందని ఈ పాదయాత్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఘనంగా గంధం ఉత్సవం



గంధం తీసుకొస్తున్న ముస్లింలు

సిద్దవటం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : హజరత్ సయ్యద్‌షావలి దర్గా ఉరుసు సందర్భంగా శుక్రవారం రాత్రి సిద్దవటం మండలం మాచుపల్లిలో పకీరుల మేళ తాళాల నడుమ గంధం, పూలచాందిని కార్య క్రమం నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ శివప్రకాష్ పాల్గొన్నారు.

చెరువులకు జలహారతి

రాజంపేట టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడంతో చుక్కనీరు లేక వెలవెలబోతున్న మన్నూరు, మదనగోపాలపురం, తాళ్లపాక, పాలెం గుంట చెరువులకు చెయ్యేరు నుంచి ఊట కాలువల ద్వారా శుక్రవారం నీరు మళ్లించడంతో ఆయా చెరువుల వద్ద రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు జగన్ మోహన్‌రాజు ఆధ్వర్యంలో జలహారతి నిర్వహించారు. పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు అనసూయమ్మ, రాష్ట్ర క్షత్రియ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ అద్దేపల్లె ప్రతాప్‌రాజు, మైనార్టీ నాయకులు గుల్జార్ బాషా, రైతులు పాల్గొన్నారు.

పంచాయతీని విభజించండి

పుల్లంపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : పరిపాలన సౌలభ్యం కోసం గ్రామ పంచాయతీని నాలుగు భాగాలుగా విభజించాలని వత్తలూరు గ్రామస్తులు డిమాండ్ చేశారు. శుక్రవారం దేవసముద్రం రెవెన్యూ సదస్సులో సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో ఈ మేరకు అర్జీ ఇచ్చారు. అలాగే గ్రామంలోని సర్వేనంబరు 362లో తమ భూమి కాకపోయినా దౌర్జన్యంగా ఇతరులు ఆన్‌లైన్ చేయించుకున్నారని వీటిపై విచారణ చేపట్టాలని ఎ.పిచ్చిరెడ్డి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు.

సుండుపల్లె: మండలంలోని తిమ్మసముద్రం గ్రామంలో నిర్వహించిన సదస్సులో రీ సర్వేతో ఉత్పన్నమైన సమస్యలు పరిష్కరించాలని 120 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు ప్రతి ఫిర్యాదుకు న్యాయం చేస్తామని అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దైవాధీనం, మండల సర్వేయర్ వెంకటసుబ్బయ్య, కూటమి నాయకులు పాల్గొన్నారు.

'జగనన్న కాలనీ'లో ఉలవ సాగు!

» దళితులకు దక్కని ఇళ్లు » లక్షలాది రూపాయలు దుర్వినియోగం!

గాలివీడు, జనవరి3 (ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీ పేరుతో లక్షలాది రూపాయలు వెచ్చించి నల్లగుట్టను చదును చేశారు. ఆ స్థలంలో ప్రస్తుతం మాజీ వలంటీరు దర్జాగా ఉలవ పైరు సాగు చేసుకుంటున్నాడు.

మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో జగనన్న కాలనీల ఏర్పాటుకు గత ప్రభుత్వం నిర్ణయించింది. పూలుకుంట పంచాయతీ రెడ్డివారిపల్లె హరిజనవాడకు చెందిన పలువురు తమకు వేరే ప్రాంతంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కొన్నేళ్లుగా కోరుతున్నారు. ఈ నేపథ్యంలో గత వైసీపీ ప్రభుత్వంలో పూలుకుంట హరిజనవాడ పక్కన సర్వే నెంబర్ 104లోని నల్లగుట్టను చదును చేసి అందులో జగనన్న కాలనీ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకున్నారు. రెండు ఎకరాలను చదును చేసి, గృహనిర్మాణాలకు ఒక ఎకరా మాత్రమే అనువుగా ఉంటుందని భావించారని దళితులు చెబుతున్నారు. ఒక ఎకరాలో 21 ప్లాట్లు వేసినా, ఆ ప్లాట్లలో తమకు అవకాశం ఇవ్వలేదని వాపోయారు. మొత్తం స్థలాలను బయటి వ్యక్తులకు కేటాయించారని, కానీ వారెవరూ ఇక్కడికి వచ్చి ఇళ్లు నిర్మించలేదని తెలిపారు. తాము 20 ఏళ్లుగా ఇంటి స్థలాల కోసం పోరాటం చేస్తున్నా ఎవరూ పట్టించుకోలేదన్నారు.

లక్షలు వెచ్చించి లక్ష్యాన్ని నీరుగార్చారు

మండలంలో 15కుపైగా జగనన్న కాలనీలుండగా, కొన్నింటిలో మాత్రమే ఇంటి నిర్మాణాలు పూర్తి అయ్యాయి. కొన్ని జగనన్న కాలనీలో ఒక్క ఇంటి నిర్మాణం కూడా ప్రారంభానికి నోచుకోలేదు. ఈ కాలనీలో 10 దాకా గుట్టలను చదును చేసి ఏర్పాటు చేసినవే. వీటిని చదును చేయడానికి ఉపాధి నిధులను ఖర్చు చేశారు. ఒక్కొక్క జగనన్న కాలనీకి రూ. 10 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు



పూలుకుంట దళితవాడ జగనన్న కాలనీలో సాగు చేసిన ఉలవ పంట

ఖర్చు చేసినట్లు సమాచారం. పూలుకుంట రెడ్డివారిపల్లె జగనన్న కాలనీకి కూడా రూ.15 లక్షలకుపైగా ఖర్చు చేసినట్లు సమాచారం. ఇన్ని లక్షలు ఖర్చు చేసినా అక్కడ ఒక్క ఇంటి నిర్మాణం కూడా చేపట్టకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ఎంతో మంది నిరుపేదల ఇంటి నిర్మాణాల కోసం ఎదురు చూశారు. కానీ ఆ జగనన్న కాలనీలో ఒక్కరంటే ఒకరు కూడా ఇల్లు నిర్మించుకోలేదు. దీంతో మాజీ వలంటీరు ఒకరు అందులో దర్జాగా ఉలవ పైరు సాగు చేసుకుంటున్నారు. జగనన్న కాలనీలో ఉలవ పైరు సాగుచేసుకోడం తన దృష్టికి రాలేదని, అలా ఎ వరైనా సాగు చేస్తున్నట్లయితే చర్యలు తీసుకుంటాం. అందులో అర్హులకు ఇంటి స్థలాలను అందజేయాలనికి కృషి చేస్తామని వీఆర్‌వో భార్గవ్ తెలిపారు.

ప్రజల భాగస్వామ్యంతోనే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి

» డిప్యూటీ డీఈవో శివప్రకాశ్‌రెడ్డి

రాయచోటి టౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అవసరమని డిప్యూటీ డీఈవో శివప్రకాశ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్‌లో జరిగిన పాఠశాల యాజమాన్య కమిటీల ముగింపు సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యంతో పాటు విద్యాంజలి, తిథి భోజనం, పొగాకు రహిత పాఠశాల వాతావరణం, పాఠశాలలో పర్యావరణ పరిరక్షణ తదితర విషయాలపై యాజమాన్య కమిటీలకు అవగాహన కల్పించారు. విద్యార్థులు సెల్‌ఫోన్ వాడకాన్ని తగ్గించాలని, విద్యార్థులు పక్కదారి పట్టకుండా చూడాలన్నారు. దురలవాట్లకు బానిసలయ్యే విద్యార్థుల జీవితంలో తలెత్తే సమస్యలపై కౌన్సిలింగ్ ఇచ్చారు. పాఠశాల యాజమాన్య కమిటీల ఏర్పాటు, విధులు, బాధ్యతలు, బాలల హక్కుల పరిరక్షణ తదితర అంశాలను క్షుణ్ణంగా వివరించారు.

ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు బాలాజీ నాయక్, వెంకటశివారెడ్డి, రీసోర్స్‌పర్సన్ రాజా రమేశ్, రామాంజనేయరెడ్డి, సికిందర్‌బాషా, గర్ల్స్ హైస్కూల్ ప్రధానో పాధ్యాయురాలు సైరాబాను తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల యాజమాన్య కమిటీల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో శివప్రకాశ్‌రెడ్డి

'ఎస్సీలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం కల్పించాలి'

రాయచోటిటౌన్, జనవరి3(ఆంధ్రజ్యోతి): వర్గీకరణతో పాటు ఎస్సీలకు విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ప్రాధాన్యం కల్పించాలని అన్నమయ్య జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బండకింద మనోహర్ కోరారు. ఎస్సీ వర్గీకరణ కోసం నియమించిన ఏకసభ్య కమిషన్ రాజేశ్‌రంజన్ మిశ్రా రాష్ట్ర పర్యటనలో భాగంగా శుక్రవారం కడప జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన సందర్భంగా బండ కింద మనోహర్ ఆధ్వర్యంలో ఎస్సీ నేతలు వినతిపత్రం సమర్పించి తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీల్లో ఉన్న 59 కులాలకు వారి వారి జనాభా దామాషా ప్రకారం విద్యా, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక సంక్షేమ రంగాల్లో లబ్ధిపొందే విధంగా ఏసీబీడీలుగా వర్గీకరణ చేయాలని కోరారు తమ విన్నపాన్ని ఏకసభ్య కమిషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేయాలని కోరారు.

'ఐకమత్యమే ముద్దు.. వర్గీకరణ వద్దే వద్దు'

నందలూరు: మాల, మాదిగ సోదరులు ఐక్యంగా ఉండాలని, వర్గీకరణ ఆపాలని అంబేడ్కర్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోలంరెడ్డి మల్లికార్జున, మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగం సంజీవ, దళిత కళా కారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాకి చంద్రమోహన్ డిమాండ్ చేశారు. వన్ కమిషన్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దళిత సోదరుల ఐక్యత ముద్దు - వర్గీకరణ వద్దు అంటూ అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు పందికాళ్ల ఎర్రయ్య, మాల మహా నాడు నాయకులు బండ్ల జయరాజ్, బండి పుల్లయ్య, చిట్టి బాబు, మాల మహానాడు ఎస్సీ వెంకటసుబ్బయ్య, దళిత సంఘం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఏకసభ్య కమిషన్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బండకింద మనోహర్

ఆలయ భూముల ఆక్రమణపై ఫిర్యాదు

రాజంపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండ్లూరు గ్రామంలో ఉన్న లక్ష్మీనారాయణస్వామి దేవస్థానానికి సంబంధించిన సర్వేనంబరు 143లోని 1.62 ఎకరాల భూమిని పలువురు రైతులు ఆక్రమించారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ గ్రామస్థులు శుక్రవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సుమారు 2 కోట్లు విలువ చేసే ఈ భూమి ఆక్రమణపై దేవాదాయశాఖ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదన్నారు. రెవెన్యూ సదస్సులో కూడా ఫిర్యాదు చేసినప్పటికి వారు ఏమాత్రం చర్యలు తీసుకోలేదన్నారు.

వివాదాస్పద భూములపై లోకేశ్‌కు ఫిర్యాదు

రాజంపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట మండలం గాండ్లపల్లెలోని సర్వేనంబరు 336లోని 20 ఎకరాల ప్రభుత్వ భూమికి సంబంధించిన వివాదాన్ని పరిష్కరించాలని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌కు ఆ గ్రామస్థులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. గ్రామనత్తంలోని ఈ భూమిని గత ఏడాది డిసెంబరు 7న కొందరు ఆక్రమించి దుక్కులు దున్నారని అయినా, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. గ్రామనత్తం భూమిని గ్రామ అవసరాలకు చెందేటట్లు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

'వెంటాడుతున్న వైసీపీ పాపాలు'

రాయచోటిటౌన్, జనవరి3(ఆంధ్రజ్యోతి): ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై వేసిన విద్యుత్ భారం నుంచి రాష్ట్ర ప్రజలు నేటికీ కోలుకోలేక పోతున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ. విద్యుత్ సంస్థల్లోని డబ్బులను జగన్‌రెడ్డి బెవరేజెస్ కార్పొరేషన్‌కు మళ్లించాడన్నారు. ఐదేళ్ల అసమర్థ పాలనతో విద్యుత్ రంగానికి రూ.1,29, 503 కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. 2019-24 మధ్యకాలంలో 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల నెత్తిన భారం మోపాడన్నారు. డిస్కంలు ప్రతిపాదించే ట్రూ అప్, ట్రూడౌన్ చార్జీల విధానాన్ని కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి తీసుకొచ్చిందని, డిస్కంలు ప్రతిపాదించే ట్రూ అప్, ట్రూ డౌన్ చార్జీల ప్రతిపాదనలను పెండింగ్‌లో పెట్టొద్దని రాష్ట్రాల విద్యుత్ నియంత్రణ మండలి ఎస్‌ఈఆర్‌సీలకు స్పష్టంగా తెలిపిందన్నారు. దీంతో వినియోగదారులపై భారం పడుతుందని హెచ్చరించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రజలు ఎవరి హయాంలో విద్యుత్ భారం పడితో తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

నిరుద్యోగులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం

రాయచోటిటౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి స్థాయిలో విఫలమయ్యాయని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) అన్నమయ్య జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేశ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ఏఐవైఎఫ్ ఏరియా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో నిరుద్యోగుల సంఖ్య నానాటికీ పెరిగిపోతోందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం యువకుల భావోద్వేగాలను రెచ్చగొట్టి అశాంతి సృష్టిస్తోందన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం డీఎస్సీని నిర్వహించేందుకు ఏ మాత్రం చర్యలు తీసుకోవడం లేదన్నారు. వలంటీర్లను విధుల్లోకి తీసుకొని, వారికి నెలకు రూ.10 వేల రూపాయల గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఐవైఎఫ్ ఏరియా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ ఏరియా అధ్యక్షుడుగా అనిల్‌కుమార్, కార్యదర్శిగా సుదర్శన్, ఉపాధ్యక్షుడుగా హరి, ఓబులేశ్, సహాయ కార్యదర్శి జగదీశ్, బాబు, కోశాధి కారిగా అంజిలతో పాటు గణేశ్‌నాయక్, చంద్రానాయక్, ప్రసాద్‌లను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

సిద్దవటం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : కారు కల్వర్టును ఢీకొనడంతో నలుగురికి గాయాలయ్యాయి. సిద్దవటం పోలీసులు కథనం మేరకు . మండలంలో కనుమలోపల్లె వద్ద శుక్రవారం తెల్లవారుజామున తిరువల నుంచి వస్తున్న కారు అదుపు తప్పి రోడ్డు పక్క ఉన్న కల్వర్టును ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఈస్ట్‌గోదావరి జిల్లా ఏలూరు గ్రామానికి చెందిన నాగరాజు(70), రమేష్(55), రామారావు(57), దుర్గారావు(55) స్వల్పంగా గాయపడ్డారు. హైవే పెట్రోలింగ్ పోలీసులు 108 వాహనంలో వారిని రిమ్స్‌కు తరలించారు.

మిద్దెపై నుంచి పడిన బాలుడు

● ప్రభుత్వ వైద్యుడు సీపీఆర్ చేయడంతో సురక్షితం

సిద్దవటం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన అహనిషత్‌రెడ్డి (18 నెలలు) మిద్దెపై నుంచి కిందపడ్డాడు. గురువారం సాయంత్రం బాలుడి అనూరాధ మిద్దెపైనుంచి కిందికి దిగి వస్తుండగా ఆమె చేతిలో నుంచి బాలుడు కింద పడిపోయాడు. దీంతో అపస్మారక స్థితిలోకి చేరుకున్న బాలుడిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా డాక్టర్ బావనాసి లక్ష్మీనారాయణ సీపీఆర్ చేయడంతో బాలుడు కళ్లు తెరిచాడు. తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

ఆక్రమణల బారిన అప్పన్నకుంట!

● కబ్జాదారుల కంబంధ హస్తాల్లో సుమారు 10 ఎకరాలు ● సర్వేతో నిజాలు వెలుగులోకి..

సుండుపల్లె, జనవరి3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రాయచోటి ప్రధాన రహదారికి పక్కనే ఉన్న అప్పన్నకుంట రాను రాను కర్పూరంలా కరిగిపోతోందని బీజేపీ రాజంపేట అసెంబ్లీ కన్వీనర్ రామాజదీశ్ రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేయడంతో శుక్రవారం రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. 2169 సర్వే నెంబర్ కింద సుమారు 29 ఎకరాల్లో అప్పన్నకుంట ఉండగా, కుంట చుట్టూ కట్టతో పాటు, ఇరువైపులా అక్రమ నిర్మాణాలు వెలిశాయని సర్వేలో తేలింది. గత వైసీపీ హయాంలోనే ఆక్రమణలు అధికంగా జరిగాయని విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే, రెవెన్యూ సదస్సులో ఇచ్చిన ఫిర్యాదుతో సర్వే చేసిన అధికారులు ఈ విషయాన్ని అంతటితోనే వదిలేస్తారా, లేక ఆక్రమణలు తొలగించి అప్పన్నకుంటకు రక్షణ కల్పిస్తారా అనేది వేచి చూడాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎన్ని ఫిర్యాదులు చేసినా తహసీల్దార్ దైవాధీనం పెద్దగా చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేంద్రనాయక్, సర్వేయర్లు కీర్తన, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

'20 వేల మొక్కలు నాటడమే లక్ష్యం'

సిద్దవటం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలో 20 వేల మొక్కలను నాటాలనే లక్ష్యంతో నర్సరీ ఏర్పాటు చేస్తున్నామని ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె శుక్రవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ ప్రతిఒక్కరు తమ పొలాల్లో తమ ఇంటి పరిసర ప్రాంతాల్లో మొక్కలను నాటి వాతావరణ కాలుష్యాన్ని తగ్గించాలన్నారు. మొక్కలను పెంచి పోషించడం వల్ల సమృద్ధిగా వర్షాలు కురుస్తాయన్నారు. అటవీ ప్రాంతాల్లో తాము మొక్కలు నాటుతామన్నారు.

రెవెన్యూ సదస్సులతో సమస్యల పరిష్కారం



రైతుల సమస్యలు తెలుసుకుంటున్న జాయింట్ కలెక్టర్ రాజేంద్రన్

రైల్వేకోడూరు(రూరల్), జనవరి 3(ఆంధ్రజ్యోతి): రైతు సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని శెట్టిగుంట పంచాయతీలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. వినతిపత్రాలు స్వీకరించారు. మండలంలోని ప్రధాన సమస్య అతుకుబడిన పట్టా భూములు, ఆన్‌లైన్ సమస్యను రైతులు జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యను త్వరగా పరిష్కరిస్తామని కలెక్టర్ రైతులకు హామీ ఇచ్చారు. నోడల్ అధికారి నాగభూషణం, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చట్టాలు



మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

వీరబల్లి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): భూసమస్యలు పరిష్కరించడానికి తెలుగుదేశం ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు తీసుకువస్తున్నట్లు రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. ఓది వీడు గ్రామం సచివాలయం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలన్నీ పరిష్కరించాలని తహసీల్దార్ శ్రావణికి తెలిపారు. టీడీపీ నేతలు భానుగోపాల్‌రాజు, నాగార్జునచారి పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందిపై ఆగ్రహం

సచివాలయ సెక్రటరీ కార్యాలయంలో గుట్టలుగా ఉన్న వైఎస్ఆర్ సంక్షేమబాట కరపత్రాలను చూసి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలవుతున్నా ఇంకా వైసీపీ పాలనలోనే ఉన్నారా అని ప్రశ్నించారు. వారంలోగా కార్యాలయం ఎదురుగా ఉన్న జగన్ మోహన్‌రెడ్డి చిత్రాలు తొలగించకుంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

న్యాయ విజ్ఞానం పెంపొందించేందుకు కృషి చేయాలి

రాయచోటిటౌన్, జనవరి3(ఆంధ్రజ్యోతి): ప్రజలందరిలో రాజ్యాంగం, చట్టాలపై పరిజ్ఞానం పెంచేందుకు భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) కృషి చేయాలని రాయచోటి ఐదవ అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి సూచించారు. శుక్రవారం మధ్యాహ్నం ఐఏఎల్ 2025 డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో న్యాయమూర్తి ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగం, చట్టాలపై ప్రజలకు వివరించేందుకు వచ్చే వారం నుంచి చైతన్య సదస్సులు నిర్వహిస్తున్నట్లు భారత న్యాయవాదుల సంఘం అన్నమయ్య, కడప ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టీ. ఈశ్వర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆనంద్‌కుమార్, రెడ్డెయ్య తెలిపారు. రాయచోటి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్. ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పీ.రెడ్డెయ్య, డీ. నాగముని, పీపీ జగన్‌మోహన్‌రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

వీరబల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం, స్నేహభావం పెంపొందుతుందని కడప లివింగ్ డయాగ్నస్టిక్ ఎండీ గాలివీటి వివేకరెడ్డి అన్నారు. వీరబల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం రామకృష్ణారెడ్డి మెమోరియల్ మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఎన్‌ఎస్‌ఎస్ పీవో రఘురామయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రికెట్ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ. 50 వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌డీఎస్ చైర్మన్ సురేంద్రారెడ్డి, కళాశాల అధ్యాపకులు భాస్కర్‌రాజు పాల్గొన్నారు.

7 నుంచి వారాహి క్రికెట్ టోర్నమెంట్

పెనగలూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పెనగలూరు హైస్కూల్ మైదానంలో ఈనెల 7 నుంచి వారాహి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీ విజేతకు జేఎస్పీ మండల అధ్యక్షుడు హరిబాబు రాయల్ రూ.50 వేల నగదు బహుమతితో పాటు కప్, రన్నర్ జట్టుకు జేఎస్పీ మండల ప్రధాన కార్యదర్శి గుబ్బూరు హరికృష్ణ రాయల్ రూ.20 వేల నగదు బహుమతితో పాటు జ్ఞాపిక అందజేస్తారని తెలిపారు.

ఇంజనీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలి

రాయచోటిటౌన్, జనవరి3(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీవీ రమణ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులతో కలిసి రాయచోటి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం రాయచోటి ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులకు గత ఏడేళ్ల నుంచి వేతనాలు పెంచలేదన్నారు., సంక్షేమ పథకాలు అమలు చేసి హెల్త్ అలవెన్సులు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, పెన్షన్, గ్రాట్యుటీ ఇవ్వాలంటూ మున్సిపల్ కమిష నర్ వాసుబాబుకు వినతిపత్రం అందజేశారు.

రాజంపేట: జీవో 36ను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పురపాలక సంఘ కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి ఆందోళన చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పీవీ రమణ, ప్రసాద్, లక్ష్మీదేవి, ఎం.రమణ, యానాదయ్య, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల బకాయిలపై ప్రభుత్వం స్పందించాలి

రైల్వేకోడూరు(రూరల్), జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల బకాయిలపై ప్రభుత్వం స్పందించాలని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఎన్జీవో హోంలో రైల్వేకోడూరు రీజనల్ కన్వీనర్ కె.వెంకటరమణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుడు జి.ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలను 30 శాతం పెంచాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు పి.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జడ్పీ, పీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు.

ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కొండూరు శరత్‌కుమార్‌రాజు

రాజంపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ క్రీడా మైదానంలో ఈ నెల 5న నిర్వహించనున్న ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీల ఏర్పాట్లను ఆ పాఠశాల కరస్పాండెంట్ కొండూరు శరత్ కుమార్ రాజు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్న మహిళలందరికీ ప్రోత్సాహక బహుమతులు ఇస్తున్నట్లు తెలిపారు. 10 మందికి వెయ్యి రూపాయలు చొప్పున ప్రత్యేక ప్రోత్సాహక బహుమతు లు ఇస్తామన్నారు. మొదటి బహుమతి 6 వేలు, రెండో బహుమతి 4 వేలు, మూడో బహుమతిగా 3 వేల రూపాయలు నగదు బహుమతి ఇవ్వను న్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, విజయనిర్మల, జయశ్రీ, నందిని పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు జయప్రదం చేయండి

పుల్లంపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకు కాకినాడలో నిర్వహించనున్న యూటీఎఫ్ రాష్ట్ర మహాసభ స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రమణమూర్తి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎంఈవో చేతులమీదుగా ఆహ్వాన పత్రికలను విడుదల చేసి ఉపాధ్యాయులకు అందజేశారు.

మూఢ విశ్వాసాలపై సమరం


చేతులకు మంటలు అంటించుకుని విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పల్లవోలు రమణ

- కుల నిర్మూలనతోనే అసమానతల తొలగింపు
- శాస్త్రీయ దృక్పథంతో ప్రజల్లో చైతన్యం
- నాస్తిక సమాజం జిల్లా కన్వీనర్ పల్లవోలు రమణ
- నేడు, రేపు విజయవాడలో ప్రపంచ నాస్తిక మహాసభలు



ప్రొద్దుటూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అతను బాల్యంనుంచే ప్రజా నాట్యమండలి కళాకారుల వెంట తిరుగుతూ పాటలు పాడటం నేర్చుకున్నాడు. హైస్కూలు స్థాయి నుంచే కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాల్లో కార్యకర్తగా పనిచేస్తూ కళాకారుడుగా గాయకుడుగా ఎదిగాడు. ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడిగా సైతం పనిచేశాడు. సీపీఐలో పనిచేసేటప్పుడు మనుషుల మధ్య ఉండే ఆర్థిక అసమానతలు తొలగిపోయే పోరాటాలపై చైతన్యం పెంపొందించుకున్నాడు. మూఢనమ్మకాలను అంధవిశ్వాసాలను మనుషుల అంతరాల్లోంచి తొలగించనిదే మనిషి మానవీయంగా ఎదగడని అర్థం చేసుకున్నాడు. తాను నాస్తికునిగా హేతువాదిగా మారాడు. విద్యార్థుల్లో, ప్రజల్లో శాస్త్రీయ భావాలు పెంపొందించేందుకు మూఢనమ్మకాలను అంధవిశ్వాసాలను పారదోలేందుకు కంకణం కట్టుకున్నాడు. ఆయన పేరే కటారు వెంకటరమణ అలియాస్ పల్లవోలు రమణ. విజయవాడలో శని, ఆదివారాల్లో ప్రపంచ నాస్తిక మహాసభలు జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి వెళుతున్న జిల్లా నాస్తిక సమాజం కన్వీనర్ పల్లవోలు రమణ ప్రస్థానం గురించి.. ఆయన మాటల్లోనే..

ఆదెమ్మ పాటలతో..

మాది మైదుకూరు నియోజకవర్గం చాపాడు మండలం పల్లవోలు గ్రామం. మాది వ్యవసాయ కుటుంబం. నా చిన్నతనం నుంచి మావూర్లో కమ్యూనిస్టు పార్టీ కమిటీ ఉండేది. మానాన్న వెంకటయ్య ఆ పార్టీలో కార్యకర్తగా ఉండేవాడు. నాకు పది పన్నెండేళ్ల వయసులో మైలవరం వద్ద ఏఐవైఎఫ్ శిక్షణా తరగతులు జరుగుతుంటే మా వూరిలోని ఆదెమ్మ అక్కడికి వంట చెయ్యడానికి వెళ్లింది. అక్కడ ఆమె ప్రజానాట్యమండలి వాళ్లు పాడిన పాటలు విని వచ్చి మాకు వినిపించింది. ఆ పాటలు నన్ను ఆకర్షించాయి. నేను మొట్టమొదట విన్నది నేర్చుకున్నది "సుత్తి కొడవలి గురుతుగ ఉన్న ఎర్రని జెండా ఎగురుతున్నది" అనే పాటను. ప్రజా నాట్యమండలి వాళ్లుపాడే పాటలకు ఆకర్షితుడినై నేను డప్పు కొట్టి పాటలు పాడటం మొదలుపెట్టాను. నాతోపాటు నా సోదరులు వెంకటేశ్వర్లు గంగయ్య పాటలు పాడేందుకు వచ్చేవారు. ఆ క్రమంలో కటారు దళంగా జిల్లాలో పేరు తెచ్చుకున్నాం. పాటలు పాడే రమణ నుంచి పల్లవోలు రమణగా పేరు వచ్చింది.

కమ్యూనిస్టుగా..

కమ్యూనిస్టు పార్టీలో చిన్నప్పటి నుంచి సభ్యుడిగా ఉన్నాను. ఏటుకూరి బలరామమూర్తి సురవరం సుధాకర్‌రెడ్డి, నల్లమల్ల గిరిప్రసాద్, శివరామిరెడ్డి లాంటి వాళ్లక్లాసులు విన్నాను. కానీ నాకు ఆ పార్టీ సిద్ధాంతాలు, రాజకీయాలు పెద్దగా బోధపడలేదు. అంతేకాక నిత్య జీవితంలో ఎదురయ్యే దేవుడు దయ్యం మూఢనమ్మకాలు అంధవిశ్వాసాలపై సీపీఐలో చెప్పలేదు. పేదల పక్షం ఉండే పార్టీగా మాత్రమే తెలుసు. నేను కొంతకాలం పత్రికల్లో చాపాడు మండల కంట్రీబ్యూటర్‌గా పనిచేశాను. ఆ తరువాత వ్యవసాయం చేశాను. వ్యవసాయ బోర్లు వేసే పనికి పోతూ బోర్లు వేసే మేస్త్రీగా ఎదిగాను. బోర్లు వేసే క్రమంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో అనేక గ్రామాలు తిరిగాను. మా వూర్లో మనుషుల మధ్య ఉండే కులవివక్షను గమనించాను. ఎంపీటీసీగా గెలిచిన ఒక దళితురాలు మావూర్లో పెళ్లిళ్లలో ఎంగిలి విస్తర్లు ఎత్తేది. ఈ సంఘటనలన్నీ నాలో కుల వివక్షను గురించి ఆలోచింపచేసేవి.

నాస్తిక సమాజం పరిచయంతో..

పదేళ్లక్రితం సోషల్ మీడియా ద్వారా భారత నాస్తిక సమాజం పరిచయమయింది. ఆ సంస్థ నాయకుడు జీడీ సారయ్యతో సంబంధాలు ఏర్పరుచుకున్నాను. అక్కడి నుంచి నేను అప్పటి వరకు నాస్తిక, హేతువాద భావాలు తెలుసుకోవడం మూఢనమ్మకాలపై అవగాహన పెంపొందించుకోవడం ప్రారంభించాను. కులం మతం దేవుడు దయ్యం సంప్రదాయాలు కట్టుబాట్ల నుంచి అతన్ని చైతన్య పరచాలంటే కచ్చితంగా సామాజిక చైతన్యం అందించాలి. మనం కూడా నిత్యం జీవితంలో సంఘర్షణపడాలి.

పెరియార్ ఆలోచనావిధానం

తమిళనాడు రాష్ట్రం చెన్నైలో ద్రవిడ కజకం వారు జరిపిన అంబేడ్కర్ 125 జయంతికి వెళ్లాను. అక్కడ తాళి తెంచి భర్త చేతిలో పెట్టే ఒక చైతన్య కార్యక్రమం ద్రవిడ ఉద్యమనాయకుడు వీరమణి ఆధ్వర్యంలో జరిగింది. అప్పుడు నేను తాళి అనేది స్త్రీకి ఒక బంధనం లాంటిదని అవగాహన పెంపొందించుకున్నాను. ఆ తరువాత ప్రపంచ నాస్తిక మేళా తిరుచురాపల్లిలో జరిగింది. అక్కడికి వెళ్లి పెరియార్ ఆలోచనా విధానాన్ని అర్థం చేసుకున్నాను. అప్పటి నుంచే నేను పూర్తిగా నాస్తికునిగా మారాను. గుంటూరు జిల్లా నిడమర్రులోని చార్వాక ఆశ్రమంలో హేతువాద సభలకు ప్రతి ఏడాది వెళ్లి అక్కడ జరిగే సమ్మేళనంలో పాల్గొనడం ద్వారా ఇతర రాష్ట్రాలలో ఉండే హేతువాద నాస్తికవాదులు పరిచయమయ్యారు. అలాగే కులనిర్మూన సంఘం వారు పరిచయం కావడంతో కుల అసమానతలు రూపుమాపందే సమాజంలో నిజమైన సమానత్వం రాదని గ్రహించాను. అది నా ఇంటినుంచే ప్రారంభించాలని నా కూతురు భారతికి కులాంతర వివాహం చేశాను. తాళి తలంబ్రాలు లేకుండా నిరాడంబరంగా పెళ్లిచేశాను. నా కుమారుడు సాయి కూడ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ చదివాడు. అతన్ని నాస్తిక భావాలతోనే పెంచాను.

మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా...

మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు కళాశాలల్లో విస్తృతంగా ప్రచారం చేశాము. ముఖ్యంగా బాబాల ముసుగులో వారు చేసే మాయలు మంత్రాలలోని లోగుట్టులను బహిర్గతం చేసేవాళ్లం. చేతిలోనించి విభూదిని తీసే టెక్నిక్ చూపించే వాళ్లం. చేతులు కాలకుండా మంటలు ఎలా మండించాలో పిల్లలకు నేర్పించాం. గాలిలో మంటలు మండించడం నోట్లో నుంచి మంటలు బయటికి తీయడం లాంటివి మనకు అద్భుతంగా కనిపించే ప్రతిచర్య వెనుక ఒక శాస్త్రీయమైన విధానం ఉంటుందని బోధించాం. నిప్పుల్లో నడవడం, మ్యాజిక్‌లు చేసి చూపడం లాంటివి చేసి ప్రజల్లో మూఢనమ్మలపై విశ్వాసం తొలగించే ప్రయత్నాలు చేపట్టాం. ప్రముఖులైన హేతువాదులు సామాజికవేత్తలను పిలిపించి సభలు సమావేశాలు చర్చలు గోష్టులు నిర్వహించాం. జీడీ సారయ్య, బాబు గోగినేని, కదిరే క్రిష్ణ, పెన్మత్స సుబ్బరాజు, డాక్టర్ బ్రహ్మారెడ్డి, ప్రొఫెసర్ కాసీం తదితరులు మేము నిర్వహించే కార్యక్రమాలకు వచ్చారు.

సామాజిక సేవాకార్యక్రమాలు

మా అమ్మ లక్షుమ్మ మరణం తరువాత ప్రతి ఏడాది దినకర్మలు చేయడం కాకుండా ఆమె మరణించిన రోజున రక్తదాన శిబిరాలు ఏర్పాటుచేశాం. స్వయంగా నేనే 25 సార్లు రక్తదానం చేశాను. మాకు తెలిసిన వాళ్ల ఎవరు మరణించినా వారి కుటుంబాలకు నేత్ర దానంపై అవగాహన కల్పించి వారి కార్నియా దానం చేసేలా కృషి చేస్తున్నాం. అలాగే శరీరదానం నేత్రదానంపై కూడా కాలేజీల్లో అనేక చోట్ల ప్రచారం చేస్తున్నాం. వారిచేత అంగీకార పత్రాలు రాయిస్తున్నాం. తెలిసిన వారు మరణిస్తే వారి శరీరాన్ని దానం చేసేలా వారి కుటుంబ సభ్యులను ఒప్పించి శరీర దానం కార్యక్రమాలను కూడా చేస్తున్నాం.

పాటల ద్వారా ప్రజల్లో చైతన్యం

నాకు ఎలాంటి డిగ్రీ చదువులు లేవు. నా పాఠశాల, ఇంటర్ విద్య కూడా సక్రమంగా సాగలేదు. నేను పెద్ద ఉపన్యాసకున్ని, రచయితను కాదు. కానీ గాయకుడిని. పాటలు పాడటం ద్వారా సామాన్య ప్రజల్లో చైతన్యం రగిలించవచ్చనే నమ్మకం కలిగినవాడిని. అందుకే సమాజంలో ఉండే ఈ సాంఘిక దురాచారాలు, మూఢనమ్మకాలు, అంధవిశ్వాసాలు, కుల అసమానతలు కులపీడన కుల దోపిడీ పోవాలని అప్పుడే నిజమైన మార్పు వస్తుందని బలంగా విశ్వసించే వ్యక్తిని. నా శక్తి మేరకు భారత నాస్తిక సమాజం ద్వారా ఇతర విప్లవ ప్రజా సంఘాల సహకారంతో సామాజిక చైతన్యం పెంపొందించే కార్యక్రమాలు చేపడుతున్నాను.

పల్లవోలు రమణ యూట్యూబ్

'పల్లవోలు రమణ' పేరుతో య్యూటూబ్ చానల్ సైతం నిర్వహిస్తున్నాను. సామాజిక చైతన్యం పెంపొందించే సామాజిక మార్పుకోసం పనిచేసే అనేక సంఘాల సభల కార్యక్రమాలు, ఉపన్యాసాలు, ప్రముఖుల ఇంటర్వ్యూలు మా చానల్ ద్వారా ప్రసారం చేస్తున్నాం.

సచివాలయాన్ని తనిఖీ చేసిన డీపీవో

పెండ్లిమర్రి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెండ్లిమర్రి గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఉదయం కడప జిల్లా పంచాయతీ అధికారిణి రాజ్యలక్ష్మి అకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మండల కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు గ్రామంలో వాటర్ క్లోరినేషన్, ట్యాంక్ క్లీనింగ్, పంచాయతీ పన్ను వసూళ్ల తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో వాటర్ క్లోరినేషన్ తప్పనిసరిగా చేయించాలన్నారు. వాటర్ ట్యాంక్‌ను శుభ్రపరిచి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్నారు. పచాయతీలోని అన్ని ఇళ్లకు షాపులకు పన్ను వసూలు వందశాతం పూర్తయ్యేలా చూడాలన్నారు. అలాగే వర్మీకంపోస్టు ఎరువులు తయార్యేలా కృషిచేయాలని, పంచాయతీకి ఆదాయం వచ్చేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శివరాం రెడ్డి, గ్రామసర్పంచు నాగమల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

థింక్ రోడ్డు సేఫ్టీ పోస్టరు ఆవిష్కరించిన మంత్రి



కడప క్రైం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ చేతుల మీదుగా థింక్ రోడ్డు సేఫ్టీ పోస్టరు ఆవిష్కరణ జరిగిందని జిల్లా రోడ్డు సేఫ్టీ ఎన్‌జీవో అధ్యక్షుడు జి.రమణ పేర్కొన్నారు. మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్టు వారి అబ్జర్వెన్సీ ఆఫ్ రోడ్ సేఫ్టీ మంత్-2025లో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన కల్పించాల్సి ఉందని, ఈ కార్యక్రమంలో ఎన్జీవో సంస్థలు భాగస్వామ్యం కావాలని కోరారన్నారు. దీంతో రోడ్ సేఫ్టీపై ఎన్‌జీవో జిల్లా కమిటి తరఫున ప్రచార బోర్డులు తయారు చేశామన్నారు. వాహనడ్రైవర్లు రోడ్డుభద్రతా సూచనలు తప్పక పాటించాలని, హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడపాలని అన్నారు. ఆ మేరకు పోస్టర్లు తయారు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రోడ్డు సేఫ్టీ ఎన్‌జీవో రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఆర్.బంగారయ్య పాల్గొన్నారు.

ఆల్ ఇండియా క్యారమ్స్ పోటీలకు అంపైర్‌గా సురే కృష్ణయ్య



నందలూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో 5 నుంచి 8వ తేదీ వరకు జరిగే ఆలిండియా క్యారమ్స్ పోటీలకు అంపైర్‌గా నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సురే కృష్ణయ్య ఎంపికైనట్లు రాష్ట్ర క్యారమ్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎస్కే జలీల్, కడప జిల్లా క్యారమ్స్ ఛైర్మన్ పోలంకి గణేష్ తెలిపారు. మొట్ట మొదటిసారిగా జాతీయ క్యారమ్స్ పోటీలకు అంపైర్‌గా ఎంపిక కావడం ఉమ్మడి కడప జిల్లాకు, క్యారమ్స్ సంఘానికి గర్వకారణమని పలువురు ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు

పదేళ్లతరువాత హంద్రీ-నీవా బకాయిల విడుదల

కలికిరి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా పథకానికి సంబంధించి మదనపల్లె ఫేజ్-2లో 65వ ప్యాకేజీకి దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న రూ.52 లక్షల బకాయిని కూటమి ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. ఈ ప్యాకేజీకి సంబంధించిన గుర్రంకొండ మండలం ఎల్లుట్ల వద్ద ప్రతిపాదించిన డిస్ట్రిబ్యూటరీ సిస్టం కింద 15,400 ఎకరాల ఆయకట్టు లక్ష్యంగా 22 కిలోమీటర్ల పొడవునా చేసిన వివిధ రకాల పనులకు సంబంధించి రూ.52,28,324లు ప్రభుత్వం బకాయి పడింది. 2013 ఏప్రిల్-నవంబరు మధ్య ఈ పనులు జరిగాయి. అన్ని చెల్లింపులు పోనూ సాంకేతిక కారణాలతో ఈ మొత్తం ఆగిపోయింది. రాష్ట్ర స్థాయిలో ఏర్పాటయిన స్టేట్ లెవెల్ టెక్నికల్ కమిటీ (ఎస్‌ఎల్‌టీసీ) 2021 ఆగస్టు 12న సమావేశమై గతంలో నిలిచిపోయిన బకాయిలు చెల్లించాలని తీర్మానం కూడా చేసి ప్రభుత్వానికి ప్రతిపాదించింది. అయినా అప్పటి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. మొత్తం వ్యవహారాన్ని సమగ్రంగా క్రోడీకరిస్తూ తిరుపతి ఎన్టీఆర్ తెలుగుగంగ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీరు గత సెప్టెంబరులో నిధుల విడుదల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. పరిశీలించిన ప్రభుత్వం బకాయి నిధుల విడుదల కోసం ఆమోదం తెలిపింది. ఈ మేరకు రూ.52,28,324లు విడుదల చేస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రాణాలు అడ్డుపెట్టి ఏపీఎండీసీని కాపాడుకుంటాం

- 5 డిమాండ్లతో కార్మికుల సమ్మె సైరన్


ఏపీఎండీసీ పరిపాలన భవనం ముందు నల్లరిబ్బన్లతో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు

ఓబులవారిపల్లె, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రాణాలు అడ్డుపెట్టి అయినా ఏపీఎండీసీని కాపాడుకుంటామని కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. ఐదు డిమాండ్లను పరిష్కరించాలని అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ వద్ద దశలవారీగా నిర్వహిస్తున్న ఆందోళనలో భాగంగా శుక్రవారం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మిక యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఇటీవల ఏపీఎండీసీ యాజమాన్యం ఆహ్వానించిన సీ అండ్ డీ, డబ్ల్యూ గ్రేడ్ టెండర్లతో సంస్థ మనుగడకే ప్రమాదం ఏర్పడేలా ఉందన్నారు. ప్రస్తుతం సీ అండ్ డీ గ్రేడ్ టన్ను ధర రూ.1600 ఉండగా, ఏపీఎండీసీ యాజమాన్యం మాత్రం టన్నుకు కేవలం రూ.1188తో 60 లక్షల టన్నులకు టెండరు పిలవడం వెనుక అంతర్యమేమిటని ప్రశ్నించారు. దీంతో సుమారు 700 మంది కార్మికుల భవిష్యత్ అంధకారంలోకి వెళుతుందని, వెంటనే ఈ టెండరును ఆపాలని డిమాండ్ చేశారు. గ్రామ కమిటీతో చేసుకున్న ఒప్పందం ప్రకారం యాజమాన్యం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. పర్మనెంట్ ఉద్యోగులకు ప్రమోషన్, రివైజ్డ్ పే అమలు చేయాలని కోరారు. బెనిఫికేషన్ ప్లాంటు ఏర్పాటు చేసి సంస్థను లాభాల బాటలో నడిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. లాభాల సొమ్మును ఏం చేశారో చెప్పకుండా 5 వేల కోట్ల రూపాయలకు సంస్థ ఆస్తులను అమ్మాలని చూడడం దారుణమని, వెంటనే ఆ చర్యలను విరమించాలని డిమాండ్ చేశారు. 15వ తేదీలోపు సమస్యలు పరిష్కరించకుంటే 16వ తేదీన నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అన్ని యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక విధానం పక్కాగా అమలు చేయండి

- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప కలెక్టరేట్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానం పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నూతన ఇసుక పాలసీ, ఇసుక బుకింగ్ సరఫరా, ఇసుక లభ్యత, పట్టా ల్యాండ్స్ వంటి అంశాలపై అమరావతి నుంచి గనులు భూగర్భ శాఖ కార్యదర్శి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, గనులు భూగర్భశాఖ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గనుల భూగర్భ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేశ్ కుమార్ మీనా మాట్లాడుతూ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు సూచనల మేరకు ఉచిత ఇసుక పాలసీని మరింత మెరుగు పరచాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత ఇసుక పాలసీ, ఆన్‌లైన్, రిజిస్ట్రేషన్, శాండ్ పోర్టల్ బుకింగ్ యాప్‌పై అవగాహన పెంచాలన్నారు. సెమీ మెకనైజ్డ్ రీచ్ సమస్యలను పరిష్కరించి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఉచిత ఇసుక పాలసీ పై ప్రజల నుండి ఫీడ్‌బ్యాక్ సేకరించాలన్నారు. మాన్యువల్ రీచుల దగ్గర ఇసుక పంపిణీ సజావుగా జరగాలన్నారు. ఆయా జిల్లాలో ఇసుక ధరలను కలెక్టర్‌లు పర్యవేక్షించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పారదర్శకంగా పంపిణీ జరగాలన్నారు. సెమీ మెకనైజ్డ్ ఇసుక రీచ్‌లను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

సృజనాత్మకతమైన ఆలోచనలు చేయాలి

కడప ఎడ్యుకేషన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు భవిష్యత్తు నిర్మాణానికి పునాదులు కావాలని, సృజనాత్మకతమైన ఆలోచనలు చేయాలి కడప ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ మాధవి అన్నారు.శుక్రవారం కడప నగరం నగరపాలక ఉన్నత పపాఠశాల మెయన్‌లో జిల్లా ఇన్‌చార్జి డీఈఓ రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లాస్థాయి లకోజి సంజీవ రాయ శర్మ సైన్స్ ఫెయిర్ కార్యక్రమం నిర్వహించారు. సైన్స్ ఫెయిర్ కార్యక్రమంలో 36మండలాల నుంచి 36 వ్యక్తిగత ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించగా మరో 36 గ్రూపు మరో 36 ఉపాధ్యాయుల ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ విద్యార్థుల ఆలోచన ధోరణి సృజనాత్మక పెంపొందించే విధంగా ఉండాలని సూచించారు. ఇన్‌చార్జి విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి, డీఎస్ఓ ఎబినేజర్ మాట్లాడుతూ జిల్లాలోని 36 మండలాల నుంచి వ్యక్తిగత గ్రూపు ఉపాధ్యాయ విభాగాలలో ప్రాజెక్టు ప్రదర్శించారని, ఇందులో చక్కటి ప్రాజెక్టులను మొదటి రెండు స్థానాల్లో ఎంపిక చేశామన్నారు. వారు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అనంతరం సౌత్ ఇండియా లెవెల్‌లో పాండిచ్చేరిలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగమణి, డీసీఈబీ సెక్రటరీ భాస్కర్‌రెడ్డి, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్, సమగ్ర శిక్ష సెక్టోరియల్ ఆఫీసర్ కేశవరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, దశరథరామ్‌రెడ్డి, గంగాధర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విజేతలతో కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, ఇన్‌చార్జి డీఈఓ రాజగోపాల్‌రెడ్డి

ఉరి వేసుకుని ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న నారాయణ

కురబలకోట, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం రాత్రి కురబలకోట మండలంలో జరిగింది. వివరాలిలా.. మండలంలోని చేనేతనగర్‌కు చెందిన ఎల్.నారాయణ(50) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటికి వచ్చి గమనించిన భార్య లక్ష్మీదేవి కేకలు వేయడంతో స్థానికులు వచ్చి అతడిని కిందకు దించారు. అప్పటికే మృతి చెందాడు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. కాగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు ముదివేడు పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని విచారించారు. ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మిద్దెపై నుంచి పడి భవన నిర్మాణ కార్మికుడి మృతి


వెంకటరమణ మృతదేహం

నిమ్మనపల్లి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మిద్దెపై నుంచి కింద పడి భవన నిర్మాణ కార్మికుడు మృతిచెందిన సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. మృతుని భార్య గంగాదేవి వివరాల మేరకు మండలంలోని బండ్లపై గ్రామంలో మూడేళ్లగా జీవనం కొనసాగిస్తున్నామని తన భర్త వెంకటరమణ(40) మేస్త్రీ పనులకు వెళ్తూ ఉండేవాడని అన్నారు. గురువారం సాయంత్రం పనులు ముగించుకుని వచ్చే క్రమంలో మిద్దెపై నుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడని అన్నారు. స్థానికులు మృతదేహాన్ని మదనపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని స్థానిక పోలీసులు తెలిపారు.

కణితి మాంసం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

కురబలకోట, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కణితి మాంసం విక్రయించేందుకు తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సెక్షన్ ఆఫీసర్ శివకుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని తెట్టు పంచాయతీ మండ్యంవారిపల్లెకు చెందిన శివ(42) స్థానిక అటవీ ప్రాంతం నుంచి కణితి మాంసాన్ని తీసుకువస్తుండగా గుర్తించామన్నారు. అతడి నుంచి మాంసాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

శేషాచలం అడవిలో బీటెక్ విద్యార్థులు అదృశ్యం

- ఆచూకీ కోసం అటవీశాఖ అధికారులతో కలసి పోలీసుల ముమ్మర గాలింపు
- మిత్రులకు లైవ్ లొకేషన్ షేర్ చేసిన విద్యార్థి

రైల్వేకోడూరు(రూరల్), జనవరి 3(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు మండలంలోని శేషాచలం అడవుల్లోని బీటెక్ విద్యార్థులు అదృశ్యమయ్యారని సమాచారం. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన ఆరుగురు బీటెక్ విద్యార్థులు అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండల పరిధిలోని శేషాచల అడవిలో ఉన్న వాగేటికోన ప్రాంతంలోని వాటర్ ఫాల్స్‌ను మరియు గుంజన వాటర్ ఫాల్స్ చూడడానికి శుక్రవారం విహారయాత్రకు వచ్చారు. వీరంతా తిరుగు ప్రయాణంలో దారి తప్పినట్లు తెలిసింది. రాత్రి కావడంతో తిరుగు ప్రయాణంలో దారి తప్పినట్లు గమనించి ఫోన్ సిగ్నల్స్ రావడంతో వారి మిత్రులకు సమాచారం అందించారు. మిత్రుల సలహా మేరకు లైవ్ సిగ్నల్స్ లోకేషన్ పంపించారు. వారందరూ అడవిలో తిరుగుతూ చివరకు రైల్వేకోడూరు అటవీ పరిధిలోని ఎస్.ఉప్పరపల్లి, ఎస్.కొత్తపల్లి ప్రాంతాల పరిధిలోకి రాగానే ఫోన్ సిగ్నల్స్ రావడంతో రేణిగుంట పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఈ మేరకు రేణిగుంట పోలీసులు కోడూరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ హేమసుందర్ రావు ఆదేశాల మేరకు కోడూరు ఎస్ఐ నవీన్ బాబు తమ సిబ్బందితో అటవీశాఖ అధికారులతో కలిసి అడవిలో జల్లెడ పడుతున్నారు. సెల్ ఫోన్ సిగ్నల్స్ అందుబాటులోకి వస్తే వారి ఆచూకీ త్వరగా లభిస్తుంది. తప్పిపోయిన విద్యార్థుల వివరాల కోసం పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది.


శేషాచలం అడవి నుంచి లైవ్ లోకేషన్ పంపిన విద్యార్థి

వామ్మో... స్మార్ట్ మీటర్

● ఆర్ఓ ప్లాంటుకు ఒకేసారి పదిరెట్లు విద్యుత్ బిల్లు
● లబోదిబోమంటున్న బాధితులు
● కెపాసిటర్ సమస్య ఉండవచ్చంటున్న అధికారులు

ఎర్రగుంట్ల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వామ్మో... స్మార్ట్ మీటర్. ఇటీవల స్మార్ట్ మీటర్ అంటేనే విద్యుత్ వినియోగదారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఎప్పుడు ఎలాంటి బాంబు పేలుస్తారనే భయంతో వణుకుతున్నారు. సాధారణ మీటర్ల నుంచి డిజిటల్ మీటర్లు, ఆపై స్మార్ట్ మీటర్ అంటూ విద్యుత్ సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వాలు వినియోగదారులపై నడ్డివిరిచే చార్జీలు వేస్తూనే ఉన్నారు. కాల్చిన యూనిట్ ధరకు తోడు ట్రూ అప్ చార్జెస్, ఏసీడీ చార్జెస్, ఇందనపు చార్జీలు, ఫిక్స్‌డ్ చార్జీలు, సర్‌చార్జీలు, ఈడీపై వడ్డీ, కస్టమర్ చార్జీలు అంటూ ఒకటేంటి ఇలా అనేక రకాల చార్జీల మోత మోయిస్తున్నారు. దీం తో వినియోగదారుడు విద్యుత్ సంస్థలు ఎప్పుడు ఏ వడ్డీ వేసి నడ్డి విరుస్తారోనన్న భయం గుప్పి ట్లో వణుకుతున్నారు. త్వరలో స్మార్ట్ మీటర్లకు ప్రీపెయిడ్ రీచార్జి సిస్టం వస్తుందన్న హాట్ టాపిక్‌తో మరింత భయపడుతున్నారు. ఇటీవల కమర్షియల్ కనెక్షన్ల మీటర్లకు స్మార్ట్ మీటర్లు అమర్చారు. అయితే వీటి వినియోగం కొన్ని చోట్ల సమస్యలు రాకపోయినా మరికొన్ని చోట్ల అధిక బిల్లులు వస్తున్నాయని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. కొందరు ఫిర్యాదులు చేస్తుండగా మరికొందరు సర్దుకుపోతున్నారు.

ఆర్ఓ ప్లాంటుకు 10రెట్ల బిల్లు...

ముద్దనూరు రోడ్డులో కోకోకోలా గౌస్ 15ఏళ్లగా వాటర్ ప్లాంట్‌ను నడుపుతున్నారు. పెన్నా నుంచి ట్యాంకర్లతో నీటిని తెప్పించి సరఫరా చేస్తుంటాడు. అయితే ఆర్ఓ ప్లాంటుకు 4814 నెంబరుతో సర్వీసు స్మార్ట్ మీటర్‌ను ఇటీవల అమర్చారు. వేసవిలో సరాసరి బిల్లు రూ.3 నుంచి రూ.4వేలు వస్తోంది. మిగతా సమయాల్లో రూ1500 నుంచి రూ.2000 వస్తోందని యజమాని గౌస్ అంటున్నారు. స్మార్ట్ మీటర్ బిగించిన వారం తరువాత విద్యుత్ సిబ్బంది బిల్లు తీస్తే రూ.10,659 వచ్చింది. ఇదేమని విద్యుత్ సిబ్బందిని అడిగితే కెపాసిటర్ మార్చుకో వాలని సలహా ఇచ్చారు. వెంటనే ఆయన కెపాసిటర్‌ను మార్చారు. ఈ బిల్లు కట్టేలోపు డిసెంబరు 2 నుంచి జనవరి 2వరకు బిల్లు తీశారు. ఇప్పుడు ఏకంగా రూ.30909 రా వడంతో వినియోగ దారుడు ఆందోళన చెందు తున్నాడు. నవంబరు, డిసెంబరు బిల్లులు కలిపి మొత్తం రూ.41568 వచ్చింది. దీన్ని కట్టాల్సిందేనని విద్యుత్ అధికారులు పేర్కొన్నారు.


పాత మీటరు బిల్లు - స్మార్ట్ మీటర్ బిల్లులు


కొత్తగా అమర్చిన స్మార్ట్ మీటర్

15ఏళ్లలో ఎప్పుడూ రాలేదు

15ఏళ్లగా వాటర్ ప్లాంట్‌ను నడుపుతున్నా. పెన్నా నుంచి ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసుకుని కూలింగ్ వాటర్ విక్రయిస్తున్నా. వేసవిలో ఏసీలు వేసినా 3 నుంచి 4వేలు మాత్రమే వచ్చేది. కానీ స్మార్ట్ మీటర్ ఏర్పాటు నుంచి భారీగా బిల్లు వస్తోంది. అధికారుల సలహా మేరకు వారు చెప్పిన కెపాసిటర్‌నే అమర్చాను. అయినా మళ్లీ డిసెంబరు బిల్లు ఏకంగా 31,000రావడం ఆశ్చర్యంగా వుంది. ఇంత బిల్లు కట్టే పరిస్థితి నాకులేదు. అసలే వ్యాపారాలు లేక ప్లాంటు జరగక తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నాము. గత రీడింగులను పరిగణలోకి తీసుకుని ఎలాగైనా బిల్లు మొత్తాన్ని తగ్గించాలని అధికారులను కోరారు.

కోకోకోలా గౌస్

పర్యవేక్షణలో ఉంచి చర్య తీసుకుంటాం

ఇలాంటివి కెపాసిటర్ సమస్యలతో వస్తాయి. దీన్ని వినియోగదారుడే చూసుకుని సరిచేసుకోవాలి. మాకు సంబందం లేదు. అయినా కెపాసిటర్, మోటార్ పనితీరును అదే సమయంలో మీటర్ రీడింగ్‌ను గంటగంటకూ పరీక్షించి చేస్తాం. డిపార్ట్‌మెంట్ పరంగా ఎక్కడైనా సమస్య వుంటే తప్పకుండా సరిచేసి, న్యాయం చేస్తాం.

ప్రియదర్శన్‌రెడ్డి, ఏఈ డిస్కం

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కడప క్రైం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రిమ్స్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు రిమ్స్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. కడప రామక్రిష్ణానగర్ వాసి కాకి శివ ఆలియాస్ శివమణి శుక్రవారం పాలకొండలు సమీపంలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ జయరాములు సిబ్బందితో కలిసి దాడి చేసి శివను అరెస్టు చేశారు. ఆరు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఏడుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

పులివెందుల టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పేకాడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.38450 నగదు స్వాధీనం చేసుకున్నామని పట్టణ ఎస్ఐ నారాయణ తెలిపారు. శుక్రవారం పట్టణ పరిధిలో సిబ్బందితో కలిసి తనిఖీ చేస్తుండగా పెద్దజూటూరు వద్ద జూదమాడుతున్న వారిని గమనించి అరెస్టు చేసి నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

పెండింగ్ పనులు పూర్తిచేస్తాం

జగన్ అనాలోచిత నిర్ణయంతోనే రోడ్ల దుస్థితి ● వేంపల్లెలో పనులను పునఃప్రారంభించిన బీటెక్ రవి

వేంపల్లె, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జగన్ అనాలోచిత నిర్ణయంతోనే రోడ్ల పనులు నిలిచిపోయాయని, కూటమి ప్రభుత్వంలో పెండింగ్ పనులు పూర్తి చేస్తామని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) అన్నారు. వేంపల్లెలో వైసీపీ ప్రభుత్వం హడావుడిగా ప్రారంభించి నిలిపేసిన రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను సీఎం చంద్రబాబు హామీతో పునఃప్రారంభించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేంపల్లె, పులివెందుల, బాకరాపురం ప్రాంతాల్లో రోడ్ల దుస్థితి అధ్వాన్నంగా ఉందన్నారు. వైఎస్ జగన్ అనాలోచిత నిర్ణయం, వైసీపీ నేతల అతి విశ్వాసం, 30ఏళ్ల అధికారంలో ఉంటామన్న అహంకారంతో ఈ రోడ్ల పనులు నిలిచిపోవడానికి కారణమయ్యాయన్నారు. వేంపల్లెలో రోడ్ల పరిస్థితులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, కాంట్రాక్టర్‌కు భరోసా ఇచ్చి పనులు పూర్తిచేసేందుకు ముందుకొచ్చామన్నారు. త్వరలోనే వేంపల్లె బస్టాండ్, అలిరెడ్డిపల్లె హైలెవెల్ బ్రిడ్జిని మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి ద్వారా ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఈఈ మాధవి, డీఈ వేణుగోపాల్, ఏఈ మనోహర్‌రెడ్డి, టీడీపీ మండల పరిశీలకులు రఘునాథరెడ్డి, కన్వీనర్ మునిరెడ్డి, జయరామిరెడ్డి, షబ్బీర్, నామా వేమకుమార్, వలి, శేషారెడ్డి పాల్గొన్నారు.


వేంపల్లెలో నిలిచిపోయిన రోడ్లు, డ్రైనేజీ పనులను పునః ప్రారంభిస్తున్న బీటెక్ రవి, ఈఈ మాధవి తదితరులు

నిరుద్యోగులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం

రాయచోటిటౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి స్థాయిలో విఫలమయ్యాయని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) అన్నమయ్య జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేశ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ఏఐవైఎఫ్ ఏరియా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో నిరుద్యోగుల సంఖ్య నానాటికీ పెరిగిపోతోందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం యువకుల భావోద్వేగాలను రెచ్చగొట్టి అశాంతి సృష్టిస్తోందన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం డీఎస్సీని నిర్వహించేందుకు ఏ మాత్రం చర్యలు తీసుకోవడం లేదన్నారు. వలంటీర్లను విధుల్లోకి తీసుకొని, వారికి నెలకు రూ.10 వేల రూపాయల గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఐవైఎఫ్ ఏరియా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ ఏరియా అధ్యక్షుడుగా అనిల్‌కుమార్, కార్యదర్శిగా సుదర్శన్, ఉపాధ్యక్షుడుగా హరి, ఓబులేశ్, సహాయ కార్యదర్శి జగదీశ్, బాబు, కోశాధి కారిగా అంజిలతో పాటు గణేశ్‌నాయక్, చంద్రానాయక్, ప్రసాద్‌లను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

సిద్దవటం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : కారు కల్వర్టును ఢీకొనడంతో నలుగురికి గాయాలయ్యాయి. సిద్దవటం పోలీసులు కథనం మేరకు . మండలంలో కనుమలోపల్లె వద్ద శుక్రవారం తెల్లవారుజామున తిరువల నుంచి వస్తున్న కారు అదుపు తప్పి రోడ్డు పక్క ఉన్న కల్వర్టును ఢీకొంది. దీంతో కారులో ప్రయాణి స్తున్న ఈస్ట్‌గోదావరి జిల్లా ఏలూరు గ్రామానికి చెందిన నాగరాజు(70), రమేష్(55), రామారావు(57), దుర్గారావు(55) స్వల్పంగా గాయపడ్డారు. హైవే పెట్రోలింగ్ పోలీసులు 108 వాహనంలో వారిని రిమ్స్‌కు తరలించారు.

మిద్దెపై నుంచి పడిన బాలుడు

ప్రభుత్వ వైద్యుడు సీపీఆర్ చేయడంతో సురక్షితం

సిద్దవటం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన అహనిషత్‌రెడ్డి (18 నెలలు) మిద్దెపై నుంచి కిందపడ్డాడు. గురువారం సాయంత్రం బాలుడి అనూరాధ మిద్దెపైనుంచి కిందికి దిగి వస్తుండగా ఆమె చేతిలో నుంచి బాలుడు కింద పడిపోయాడు. దీంతో అపస్మారిక స్థితిలోకి చేరుకున్న బాలుడిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా డాక్టర్ బావనాసి లక్ష్మీనారాయణ సీపీఆర్ చేయడంతో బాలుడు కళ్లు తెరిచాడు. తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

అప్పుల బాధతో అన్నదాత ఆత్మహత్య


మహేశ్వర్ రెడ్డి మృతదేహం - ఫైల్ ఫొటో

పెద్దముడియం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో రైతు మహేశ్వర్‌రెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య స్వర్ణలత ఫిర్యాదుపై నమోదైన పోలీసు కేసు వివరాల్లో కెళితే.... కొండసుంకేసుల వాసి మహేశ్వర్‌రెడ్డి కుటుంబం వ్యవసాయం చేస్తూ జీవనం సాగించే వారు. వారికి ఉన్న 8 ఎకరాలకు తోడు మరో ఆరెకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తూ వస్తున్నారు. పంటల దిగుబడి సరిగా రాక అప్పులు పెరుగుతూ వస్తున్నాయి. ఇటీవల వచ్చిన తుపానుల ప్రభావంతో పంటలు దెబ్బతిన్నాయి. అంతేకాకుండా ప్రస్తుత తుపాను మరింత దెబ్బతీసింది. గురువారం రాత్రి భార్యతో అప్పులపై మాట్లాడాడు. భార్య సర్దిచెప్పి పిల్లలతో కలిసి ఓ గదిలో నిద్రపోగా మరో గదిలో నిద్రపో యిన మహేశ్వర్‌రెడ్డి తెల్లారే సరికి ఫాన్ కొక్కీకి శవమై వేలాడుతూ కన్పించాడు. భార్య స్వర్ణలత ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని ఆస్ప త్రికి తరలించారు.

మద్యానికి బానిసై తండ్రిని చంపిన తనయుడు

ప్రొద్దుటూరు జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన కుమారుడు మద్యం తాగటానికి డబ్బులు ఇవ్వలేదని గురువారం రాత్రి కన్నతండ్రిని హత్య చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే... ప్రొద్దుటూరు పట్టణం మోడంపల్లెలో వెంకటస్వామి (65) అనే వృద్ధుడిని ఆయన కుమారుడైన వెంకటసుబ్బయ్య మద్యం తాగటానికి డబ్బులు ఇవ్వలేదని కర్రతో తలపై మోదాడు. దీంతో తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో వెంకటస్వామి మరణించాడు. ఈ ఘటన గురువారం అర్ధరాత్రి చోటుచేసుకోగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. మృతుడు వెంకస్వామిభార్య లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

వీరారెడ్డి మృతదేహానికి నేడు శవపరీక్ష

మైదుకూరు రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు మున్సిపాలిటీలోని శెట్టివారిపల్లె గ్రామానికి చెందిన అల్లాడుపల్లె వీరారెడ్డి (75) డిసెంబరు 6వ తేదీ మృతి చెందాడు. తన తండ్రి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ మైదుకూరు పోలీసు స్టేషన్‌లో వీరారెడ్డి కుమారుడు రమేష్ ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటన మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ దృష్టికి వెళ్లింది. వెంటనే ఆయన స్పందించి వీరారెడ్డి మృతిపై వెంటనే విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీనిపై ఉన్నతాధికారులు చొరవ తీసుకొని శనివారం రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్, పోలీస్ ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో వీరారెడ్డి మృతదేహానికి శవపరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

7న కేంద్ర కరువు బృందం పర్యటన

బి.కొత్తకోట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో సాగైన పంటలకు జరిగిన నష్టాన్ని పరిశీలించేందుకు కేంద్ర కరువు బృందం ఈ నెల 7వతేదీ జిల్లాకు రానుంది. పెరీన్‌దేవి, పాలసీ అండ్ కోఆర్డినేషన్ జాయింట్ సెక్రటరీనేతృత్వంలో సుప్రియామాలిక్, అనూరాధాబటానా, అశిష్ పాండేలతో కూడిన కరువుబృందం బి.కొత్తకోట పరిధిలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌కు చేరుకుంటారు. రాత్రికి హిల్స్‌లో బస చేస్తారు. 8న ఉదయం 9గంటల నుంచి నిర్దేశించిన గ్రామాలలో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించి, బాధిత రైతులతో ముఖాముఖి మాట్లాడతారు. అనంతరం వ్యవసాయశాఖ, రెవెన్యూ అధికారులతో సమీక్షిస్తారు.

పరిసరాల శుభ్రతతోనే వ్యాధుల కట్టడి

కడప కలెక్టరేట్, జనవరి3 (ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రతతోనే సీజనల్ వ్యాధులను కట్టడి చేయవచ్చని జిల్లా మలేరియా అధికారి మనోరమ చెప్పారు. సీజనల్ వ్యాధులకు ప్రధాన కారణమైన దోమలను నియంత్రించడంలో భాగంగా ప్రతి ఒక్కరూ 'ఫ్రైడే డ్రైడే' పాటించాలన్నారు. నగరంలోని అబ్దుల్ నబీ వీధిలో దోమల నివారణ, మలేరియా, డెంగ్యూ, గున్యా వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. అప్పర్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేశారు.

కనకదాసు ఉత్సవాలకు మంత్రికి ఆహ్వానం


మంత్రికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న కురబసంఘం నాయకులు

మదనపల్లె, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో ఘనంగా జరగనున్న భక్త శ్రేష్ట కనకదాసు 537వ జయంతి ఉత్సవాలకు రావాలని జౌళి, చేనేత శాఖ మంత్రి ఎస్.సవితను కురబసంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు కోరారు. విజయవాడలోని సెక్రటేరియట్‌లో శుక్రవారం మంత్రిని కలసి ఆహ్వాన పత్రికను అందజేశారు. మదనపల్లెలో ఏటా కనకదాసు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని, ఇందులోభాగంగా ఈనెల 23న కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే ఆదోని బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధిని కలసి ఆహ్వాన పత్రిక అందజేశారు. మంత్రిని కలసిన వారిలో కురబసంఘం నేతలు వశికేరి లింగమూర్తి, చిరుతల విఠల్‌గౌడ్, కృష్ణంరెడ్డిపల్లె కాటమయ్య, తదితరులు ఉన్నారు.

మాజీ సీఎం కిరణ్‌ను కలిసిన ఎమ్మెల్యే

మదనపల్లె టౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం మదనపల్లెకు వచ్చిన నల్లారి కిరణ్‌ను స్థానిక కదిరిరోడ్డులో కలిసిన ఎమ్మెల్యే మాజీ సీఎంకు శాలువ కప్పి స్వాగతం పలికారు. గతంలో నల్లారి సీఎంగా ఉన్నప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేగా షాజహాన్‌బాషా ఆయనతో పనిచేశారు.

డీఐజీని కలిసిన రామ్‌దాస్‌చౌదరి



మదనపల్లె, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కర్నూలు రేంజీ డీఐజీ కోయప్రవీణ్‌ను జనసేన రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామ్‌దాస్‌చౌదరి కలిశారు. కర్నూలులో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వివిధ అంశాలపై చర్చించారు. రామ్‌దాస్‌చౌదరితోపాటు జనసేన ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరామ్‌రాయల్, పార్టీ మండల అధ్యక్షుడు గ్రానైట్ బాబు, తదితరులు ఉన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

పీలేరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పీలేరు మండలం కాకులారంపల్లె ఇందిరమ్మ కాలనీలో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు టీడీపీ టౌన్ అధ్యక్షుడు దళవాయి సురేశ్ కుమార్ రెడ్డి (కంచి సూరి) శుక్రవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ ఉచిత వైద్య శిబిరంలో తిరుపతిలోని శ్రీ రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఇందిరమ్మ కాలనీతోపాటు పరిసర ప్రాంతాల్లో గ్రామస్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పగలు డంపింగ్..రాత్రి లిఫ్టింగ్

- ఇసుక అక్రమ రవాణాపై చర్యలు ఏవీ?
- అధికారులు పట్టించుకోవడంలేదంటూ విమర్శలు

వాల్మీకిపురం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం మండల వ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. అధికారుల పర్యవేక్షణ లోపమో..?లేదా వారే అండగా ఉన్నారో తెలియదు కానీ ఇసుక అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. నిత్యం వేకువ జామున నాలుగు గంటలకు మొదలయ్యే


వాల్మీకిపురం మండలం సాకిరేవుపల్లె సమీపంలో ఇసుకను అక్రమంగా డంపింగ్ చేసిన దృశ్యం

ఇసుక అక్రమ రవాణా పట్టణంలోని బైపాస్ రోడ్డు గుండా జోరుగా సాగుతున్నా అడిగేవారే లేరు. స్థానిక అవసరాలకు ఉచితం అన్న ఇసుక ప్రస్తుతం బయటి ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న మాఫియాదే రాజ్యం అన్న విధంగా తయారైంది. నిఘా పెట్టాల్సిన అధికారులు కూడా రాజకీయ ఒత్తిళ్లతో చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలువస్తున్నాయి. రాత్రి సమయాలలో గస్తీ పోలీసులు ఇసుక ట్రాక్టర్లపై చర్యలు తీసుకోకపోగా లాలూచిపడి వదిలేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. మండల వ్యాప్తంగా బాహుదా కాలువ ప్రాంతాన్ని ఇప్పటికే ఇసుక మాఫియా గుల్ల చేశారు. ఇసుక అక్రమాలపై ఫిర్యాదులు చేసినా ప్రయోజనం లేదన్నది గ్రామీణ ప్రాంత ప్రజలు, రైతుల ఆరోపణ. మండలంలోని కూరపర్తి, చింతపర్తి, మాధవరంపల్లె భోగంపల్లె రిజర్వాయర్ తదితర ప్రాంతాలలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణా పట్ల ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఇసుక అక్రమాలపై ముమ్మర నిఘా..

వాల్మీకిపురం సర్కిల్ పరిధిలోని వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాలలో ఇసుక అక్రమ రవాణా, డంపింగ్‌లపై ఇప్పటికే ముమ్మర నిఘాపెట్టి చర్యలు తీసుకుంటున్నాం. స్థానిక అవసరాల నిమిత్తం కాకుండా బయటిప్రాంతాలకు అక్రమంగా రవాణా చేసినా, రహస్య డంపింగ్‌లకు పాల్పడిన ఎంతటి వారైనా ఉపేక్షించబోం. చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. అక్రమ రవాణా, డంపింగ్ వివరాలను ప్రజలు కూడా సహకరించి పోలీసులకు తెలియజేయాలి.

-ప్రసాద్‌బాబు, సీఐ, వాల్మీకిపురం

తైక్వాండో పోటీలకు ములకలచెరువు విద్యార్థులు


ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ములకలచెరువు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు కస్తూరిబాగాంధీ బాలకల గురుకుల పాఠశాల విద్యార్థులు అంతర్జాతీయ తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారు. కల్‌కత్తాలో గత నెల 28, 29 వతేదీల్లో జరిగిన అంతర్జాతీయ తైక్వాండ పోటీలు, సెలక్షన్‌ల్లో పాఠశాల విద్యార్థులు రేఖా, ఐశ్వర్య, రాధాలు పాల్గొన్నారు. ఇందులో విద్యార్థులు రేఖా, ఐశ్వర్యలు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మెమోంటోలు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఈ మేరకు స్థానిక పాఠశాలలో శుక్రవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్ శిల్ప, పీడీఎం రేష్మాలు అభినందించారు.

పశుగణన పక్కాగా చేపట్టాలి

నిమ్మనపల్లి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పది పంచాయతీలలో పశుగణనను పక్కాగా లెక్కించాలని పశువైద్యాధికారి సురేష్ పేర్కొన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో పశువైద్య సిబ్బందికి 21వ జాతీయ పశుగణనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ పశుగణన 5ఏళ్లకు ఒక సారి జరుగుతుందని ప్రస్తుతం నవంబరు 1 నుంచి ఫిబ్రవరి 28వరకు లెక్కిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 16పక్షాదుల గురించి పూర్తి సమాచారన్ని పక్కాగా లెక్కించాలని తెలిపారు. మండలంలోని గొర్రెలు, ఆవులు, గేదెలు, బాతులు, కోళ్లతో పాటు పలు రకాల పక్షాదులు, ఇతర జంతులను లెక్కించాలని తెలిపారు. ప్రస్తుతం మండలంలో 9662 ఇళ్లు ఉండగా 64 శాతం ఇళ్ల సర్వే పూర్తి స్థాయిలో చేసినట్లు తెలిపారు. ఇక మిగిలిన ఇళ్లను త పూర్తి చేయాలని సిబ్బందికి తెలిపారు. అలాగే ఎదకు వచ్చిన పాడి రైతులు ఆవులకు టీకాలు వేయించు కొంటే ప్రభుత్వం సబ్సిడీతో కేవలం రెండు టీకాలకు కలిపి రూ.500లకే అదిస్తుందని తెలిపారు.

ఒకరిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు

నిమ్మనపల్లి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): టిప్పర్‌ను బాడుగకు ఇచ్చి డబ్బులు ఇవ్వమని అడగగా కులం పేరుతో దూషించిన వ్యక్తిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు శుక్రవారం ఇన్‌చార్జి ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతి చలిమామిడి దళితవాడకు చెందిన సహదేవ తనకు చెందిన టిప్పర్‌ను అగ్రిమెంట్‌పై మదనపల్లి వాసి రాటకొండ రమేష్‌నాయుడకు బాడుగకు ఇచ్చాడు. అయితే టిప్పర్ బాడుగకు ఇచ్చి నెలలు గడుస్తున్నా బాడుగ ఇవ్వక పోవడంతో రమేష్‌నాయుడును బాడుగ డబ్బులు ఇవ్వాలని కోరాడు. దీంతో రమేష్ నాయుడు కులం పేరుతో దూషించి నానాబూతులు తిట్ట అవమానించాడు. సహదేవ ఫిర్యాదుతో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

పోలీసుల సమక్షంలో చిన్నారి అప్పగింత

వాల్మీకిపురం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రి ఆవరణలో శుక్రవారం ఉదయం ఓ చిన్నారి ఏడుస్తూ ఒంటరిగా కనిపించింది. ఆ సమయంలో అందరూ అక్కడ రద్దీగా ఉండటంతో పాపను ఎవరూ గుర్తించలేకపోయారు. బోరున విలపిస్తూ ఒంటరిగా తిరుగుతున్న చిన్నారిని స్థానికులు పోలీసులకు అప్పజెప్పారు. ఎస్‌ఐ చంద్రశేఖర్ సిబ్బంది సహాయంతో చిన్నారి వివరాలు ఆరా తీయగా నిమ్మనపల్లె మండలం తవళం గ్రామానికి చెందిన తెలిసింది. తక్షణం చిన్నారి రెడ్డిమోక్షితగా గుర్తించి తన పిన్ని అయిన సోనియాకి అప్పగించారు. కాగా చిన్నారి తల్లిదండ్రులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఘనంగా సావిత్రి బాయి పూలే జయంతి


సావిత్రి బాయి పూలేకు నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పీలేరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు పూలే సతీమణి, దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు అయిన సావిత్రిబాయి పూలే 194 వ జయంతిని గురువారం పీలేరులోని పలు ప్రజా, కార్మిక సంఘాలు ఘనంగా జరుపుకున్నాయి. బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సావిత్రి బాయి పూలే, దేశంలో తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు అయిన ఫాతిమా షేక్ చిత్రపటాలను ఆవిష్కరించి వారికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బలరాం మాట్లాడారు. ముడుపులవే ముల పంచాయతీ విద్యానగర్‌లో దళిత సంఘాలు జయంతి నిర్వహించారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో డీవీఎంసీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ సభ్యులు, దళిత సంఘాల నేతలు తుమ్మల ధరణీకుమార్, గట్టప్ప, జెట్టి మల్లిఖార్జున, హరినాథ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి

మదనపల్లె టౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మహిళలు చదువుతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం సావిత్రి బాయి పూలే 194వ జయంతి సందర్భంగా మదనపల్లెలో పలుచోట్ల ఆమె చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బహుజన సేన అధ్యక్షుడు శ్రీచందు ఆధ్వర్యంలో మహిళా అధ్యాపకులను సన్మానించారు. విజయభారతి హైస్కూల్ కరెస్పాండెంట్ ఎన్.సేతు మాట్లాడారు. అనంతరం పలు రంగాల్లో రాణిస్తున్న మహిళలను ప్రత్యేకంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం శ్రీనివాసులు, బలిజ సంఘం రెడ్డిప్రసాద్, బహుజన సేన నాయకులు హరికృష్ణ, భానుప్రకాష్, మహమ్మద్ అలీ, వెంకటేష్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.
స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. అనంతరం పలువురు మహిళా అధ్యాపకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమాదేవి, ఇతర అధ్యాపకులు, బాలికలు పాల్గొన్నారు.

ఆధునిక భారత తొలిమహిళ పూలే


సావిత్రి బాయి పూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బాస్‌నాయకులు

మదనపల్లె, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఆధునిక భారతదేశ మహిళ టీచర్ సావిత్రిబాయి పూలే అని బాస్ నాయకులు కొనియాడారు. స్థానిక బాస్ కార్యాలయంలో శుక్రవారం పూలే 194వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగ ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బాస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దపాలెం రవిశంకర్, మహిళా నాయకురాలు పాల్గొన్నారు.
గుర్రంకొండలో:మహిళల విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేసిన సావిత్రిబాయి పూలే చరిత్రలో నిలిచిపోతారని కోన హైస్కూల్ హెచ్‌ఎం చెంగల్‌రాయులు అన్నారు. జాతీయ మహిళా ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురష్కరించుకొని శుక్రవారం ఆమె చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.
బి.కొత్తకోటలో: సంఘసంస్కర్త, దేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీ బాయిపూలే 194వ జయంతిని శుక్రవారం బి.కొత్తకోటలో ఘనంగా నిర్వహించారు. పట్టణం లోని పోకనాటివీధిలో టీడీపీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్, దిగువబస్టాండులో బిల్డింగ్‌వర్కర్స్ యూనియన్, భారత్ స్కూల్‌లో కరెస్పాండెంట్ శ్రీనివాసులురెడ్డిల ఆధ్వర్యంలో సావిత్రీబాయిపూలేకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో దేరింగుల నారాయణ, కావడి రవీంద్ర, చావిడికిట్టన్న,నక్కామహేష్, సచిన్, సింగన్న, ఏఐటీయూసీ నాయకులు, భారత్ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి సన్నాహాలు


మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ నాయకుడు భువనేశ్వర్ సత్య కుటుంబసభ్యులు

మదనపల్లె అర్బన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీజేపీ సంస్థాగతంగా బలోపేతానికి సన్నాహాలు చేస్తున్నట్లు మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సొసైటీ కాలనీలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జమిలి ఎన్నికలతో ఒకేదేశం, ఒకే ఎన్నికలు బీజేపీ నినాదాన్ని సంస్థాగత ఎన్నికల్లో కలిసికట్టుగా ఏకాభిప్రాయంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఏపీలో బీజేపీ కూటమిలో ఉన్నామన్నారు. భారతీయ జనతా పార్టీ దేశంలోనే అతిపెద్ద పార్టీ అన్నారు. దేశవాప్తంగా బీజేపీ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పెద్దఎత్తున జరిగిందని గుర్తు చేశారు. బీజేపీ పాలన చూసిన అనంతరం పెద్దఎత్తున ప్రజలు ఆకర్షితులయ్యారన్నారు. 75 ఏళ్ల ప్రజాస్వామ్య దేశంలో ప్రజలకు సంక్షేమం అందించే అనేక కార్యక్రమాలను బీజేపీ అమలు చేస్తోందన్నారు. దేశవ్యాప్తంగా జనగణన జరగాల్సి ఉందని, కరోనా కారణంగా నిలిచిందన్నారు. అలాగే జనాభా ప్రాతిపదికపైనా పార్లమెంట్లు, అసెంబ్లీ పునర్విభజన జరగాల్సి ఉందన్నారు. కాగా పార్లమెంట్‌లో మహిళా బిల్లును అమోదం తెలపాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రధాని మోదీ దేశంలోని అన్ని రాష్ట్రాలు, ప్రాంతాలు భాషలు సంస్కృతి కలుపుబోయే ప్రయత్నం చేస్తూ సబ్ కా సాత్, సబ్ కా వికాస్ అనే నినాదాన్ని ముందుకు తెస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లె ప్రశాంత్, మదనపల్లె పట్టణ అధ్యక్షుడు బర్నేపల్లె రవికుమార్, బీజేపీ పార్టీ జిల్లా ఎన్నికల అధికారులు అంకాల్‌రెడ్డి, నరసింగరావు, కృష్ణయాదవ్, బీజేపీ నాయకులు జేకే వర్మ, పూలనాగరాజ, భువనేశ్వర్‌సత్య, జర్మనీరాజు, సీటీఎం కిరణ్‌కుమార్, అసెంబ్లీ కన్వీనర్ భగవాన్, పట్టణ కోశాధికారి కోసూరి భవాని, ఉపాధ్యక్షుడు కొండయ్య, బీజేపీ వెంటకేష్,బొమ్మిశెట్టికృష్ణమూర్తి, లక్ష్మీనారాయణ, మాజీ కౌన్సిలర్ ఆంజనేయులు, నీలకంఠ, యూటీఎఫ్ నాయకులు పురంవెంకటరమణ, పురంసుధాకర్, తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు స్థానిక నీరు గట్టువారిపల్లె లోని బీజేపీ నాయకుడు భువనేశ్వర్ సత్య మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డిని దుశాలువ కప్పి సత్కరించారు.

నేటి నుంచి మదనపల్లెలో క్రికెట్ టోర్నమెంట్

మదనపల్లె టౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మదనపల్లె ప్రాంతంలో క్రీడాకారులను ప్రోత్సహించడానికి శనివారం నుంచి సుకుమార్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఎంబీ టీమ్ సభ్యులు టీవీఎస్ బాబు, బావాజాన్‌లు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బీటీ కళాశాల మైదానంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ మదనపల్లె మార్కెట్ యార్డు మండీ యజమానుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు ఈ టెన్నీస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రథమ బహుమతిగా రూ. లక్ష, ద్వితీయ బహుమతిగా రూ.50వేలు నగదు అందజేస్తామన్నారు. వీటితో పాటు మ్యాన్ ఆఫ్ ది సిరీస్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌లకు జ్ఞాపికలు అందజేస్తామన్నారు. ఇప్పటి వరకు 25 జట్లు పేర్లు నమోదు చేసుకున్నారని, మదనపల్లె పట్టణ ప్రజలు, క్రీడాకారులు ఈ టోర్నమెంట్‌ను జయప్రదం చేయాలని కోరారు.

సీపీఎస్ వద్దు.. పాత పెన్షన్ పునరుద్ధరించాలి

మదనపల్లె అర్బన్, జనవరి 3ఆంధ్రజ్యోతి): సీపీఎస్ రద్దు చేసిపాత పెన్షన్ పద్ధతిని పునరుద్దురించాలని ఏపీసీపీఎస్‌ఈఏ నాయకులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా నూతన తమ క్యాలెండ్‌ను శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆవిష్కరించారు. ఈసందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సొరకాయల శ్రీనివాసులు, రాష్ట్ర ఆడిటింగ్ కమిటీ చైర్మన్ రంజిత్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాజేంద్రకుమార్, అసోసియేషన్ అధ్యక్షుడు నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ 2004 సెప్టెంబరు తరువాత ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరిన ఉపాధ్యాయులు, ఉద్యోగులకు వృద్ధాప్య పెన్షన్ కంటే తక్కువ పెన్షన్ పదవీవిరమణ తరువాత అందుతుందన్నారు. దీంతోపాటు డీఏ, పీఆర్సీ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయం సీఎం దృష్టికి తీసుకెళ్లి మాకు న్యాయం చేయాలని స్థానిక ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కిల్లానాగరాజు, వెంకట్, రవీంద్ర, ఈశ్వర్యయ్య, రెడ్డిబాషా, రంజిత్‌కుమార్, రాజేష్‌కుమార్, నరేష్, జయంతి, తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 21 నుంచి మిట్స్‌లో అశ్వ


అశ్వ-2కె25ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ సి.యువరాజ్‌లు తదితరులు

కురబలకోట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫిబ్రవరి 21, 22 తేదీల్లో రెండు రోజుల పాటు జాతీయ స్థాయిలో టెక్నో కల్చరల్ స్పోర్ట్స్ ఫెస్ట్ అశ్వ-2కె25ను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సి.యువరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ప్రిన్సిపాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది నిర్వహించే కార్యక్రమానికి విద్యార్థులనుంచి ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, డబ్లుడబ్లుడబ్లు. మిట్స్‌ఏసీ.ఇన్ వెబ్‌సైట్ నందు ఇంజనీరింగ్, పిజీ, డిగ్రీ విద్యార్థులు ధరఖాస్తులు చేసుకోవాలన్నారు. జాతీయస్థాయిలో నిర్వహించే పోటీలలో వివిధ రకాల పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కమాల్‌బాషా, కో కన్వీనర్ ప్రదీప్‌కుమార్, కో కన్వీనర్‌లు జగన్‌మోహన్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి, హారిక, హర్షిత తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ భూములు ఆక్రమిస్తే చర్యలు


జర్రావారిపల్లె రెవెన్యూ సదస్సులో వినతులు స్వీకరిస్తున్న అధికారులు

వాల్మీకిపురం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖకు సంబంధించి ఎక్కడైనా ఆలయ భూములను ఆక్రమించినట్లు తెలిస్తే చర్యలు తప్పవని జిల్లా దేవదాయ శాఖాధికారి విశ్వనాథ్ పేర్కొన్నారు. శుక్రవారం వాల్మీకిపురం మండలంలోని జర్రావారిపల్లె గ్రామంలో రెవెన్యూ సదస్సుకు హాజరైన ఆయన మాట్లాడుతూ ఆలయ భూముల ఆక్రమణదారులను చట్టప్రకారం నోటీసులు ఇచ్చి నిబంధనల మేరకు ఆక్రమణలు తొలగించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. పలు చోట్ల దేవాలయ భూములను అనుభవిస్తూ కౌలు చెల్లించకుండా ఉన్న వారిపై విచారణ జరిపి సంబంధిత రైతులు దేవాలయాలకు కౌలు చెల్లించేలా చూస్తామన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ పరిధిలో భూ సమస్యలు, వ్యవసాయ భూములకు రైతులు ఎదుర్కొంటున్న దారి సమస్యలపై వినతులు స్వీకరించి పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ పామిలేటి, స్పెషలాఫీసర్ లక్ష్మీప్రసన్న, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, జడ్పీటీసీ నిర్మల, సర్పంచ్ మునిభాస్కర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుగుణ, సర్వేయర్ పూర్ణచంద్ర, వివిధశాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది, కూటమి పార్టీల నాయకులు, రైతులు పాల్గొన్నారు.
మదనపల్లె టౌన్‌లో: మండలంలోని కోళ్లబైలు-1, కోళ్లబైలు-2 గ్రామ పంచాయతీల్లో రెవెన్యూ సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో నిరుపేదలకు 2 సెంట్ల ఇంటి స్థలం కేటాయిస్తున్నామన్నారు. రెవెన్యూ, పంచాయతీ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర, డీఎల్‌డీవో అమరనాథరెడ్డి, తహసీల్దార్ ఖాజాబీ, ఆర్‌ఐ శేషాద్రిరావు , టీడీపీ నేత రాటకొండ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో 132 అర్జీలు

పెద్దమండ్యం, జనవరి 3(ఆంధ్రజ్యోతి) మండలంలోని పాపేపల్లి గ్రామ పంచాయతీ గుడిసెవారిపల్లి లో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో 132 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ సయ్యద్ అహ్మద్ వెల్లడించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యలు, రేషన్ కార్డులు, ఆన్‌లైన్, తదితర అంశాలపై అర్జీలు వచ్చినట్లు తెలిపారు. సర్పంచ్ పీరాన్‌బీ, కూటమి నేతలు సీతాపతిరెడ్డి, గల్లా నారాయణ, ఆర్‌ఐ రమేష్, మండల సర్వేయర్ హసీన్‌తాజ్, దేవదాయశాఖ కార్యదర్శి రెడ్డిక్రిష్ణ, ఈవోఆర్డీ జనార్ధన తదితరులు పాల్గొన్నారు.
పెద్దతిప్పసముద్రంలో:మండలంలోని సంపతికోటలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి 32 అర్జీలు వచ్చాయని వాటిలో రెవెన్యూ కు సంబంధించినవి 13 కాగా ఇతర సమస్యలపై 19 ఉన్నాయని అధికారులు తెలిపా రు. కాగా తమ భూములను సబ్ డివిజన్ చేసి పాసు పుస్తకాలు మంజూరు చేయాలని, గత 15 సంవత్సరాలుగా రెవెన్యూ కార్యాలయాల చూట్టు తిరుగుతున్నా మని మరవపల్లెకు చెందిన మస్తాన్‌రెడ్డి అనే రైతు అధికారుల ఎదుట వాపోయా డు. అదే విధంగా సంపతికోట, బూచిపల్లె, మల్లెల గ్రామాలకు చెందిన పలువురు రైతులు వ్యవసాయ సహకార పరపతిలో ట్రాక్టర్లు మంజూరు కాగా వైసీపీ ప్రభుత్వ పాలనలో కొందరు వైసీపీ నాయకులు వారికి అనుకూలంగా ఉన్న వారిని నియమించుకుని అర్హులైన రైతులకు తీవ్రఅన్యాయం చేశారంటూ అధికారులకు అర్జీలు అందజేశారు. ఈ సదస్సుకు మండల తహసీల్దార్ శ్రీరాములు నాయక్, టీడీపీ నాయకులు సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు సంపతికోట కిట్టన్న, స్థానిక సర్పంచ్ చిన్నరెడ్డెప్ప, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

డీకేటీ భూములు కబ్జా చేసిన వైసీపీ

- టీడీపీ నేత జయచంద్రారెడ్డి ధ్వజం


మాట్లాడుతున్న జయచంద్రారెడ్డి

బి.కొత్తకోట, జనవరి 3(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గంలో గడచిన ఐదేళ్లలో వందల ఎకరాల డీకేటీ భూములను వైసీపీ నాయకులు కబ్జా చేశారని, నియోజకవర్గ టీడీపీ నేత జయచంద్రారెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం మండలంలోని కోటావూరులో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలు లేని నియోజకవర్గం ఏదైనా ఉందా అంటే అది తంబళ్లపల్లే అని అన్నారు. భూ సమస్యల గుర్తింపు, వాటి పరిష్కారం కోసమే కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్ మాట్లాడుతూ వైసీపీ నాయకులు చేసిన దాష్టీకాలను రెవెన్యూ సదస్సుద్వారా ప్రజలు బయటపెట్టాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వివిధ భూసమస్యలపై 22 అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ మహమ్మద్‌అన్సారీ, మాజీ సర్పంచ్ జయచంద్రారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మదన్ మోహన్‌రెడ్డి, చిటికి శివారెడ్డి, మొటుకుశివ, రఘునాథ్‌రెడ్డి, రవికుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.

నవోదయలో తాగునీటి సమస్య పరిష్కారం


నవోదయ విద్యాలయలో తాగునీటి బోరు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం వలసపల్లె వద్ద ఉన్న జవహర్ నవోదయ విద్యాలయలో తాగునీటి సమస్యను ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పరిష్కరిం చారు. గతంలో నవోదయలో పర్యటించినప్పుడు నీటి సమస్య ఉందని ప్రిన్సి పాల్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఎమ్మెల్యే మదనపల్లె మండల పరిషత్ నిధులు రూ.5లక్షలు వెచ్చించి బోరు తవ్వించి కొత్త మోటారు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో శుక్రవారం ఈ బోరు మోటారును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తాజ్‌మస్రూర్, నవోదయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వేలా యుధన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేషన్ సరుకులు సకాలంలో పంపిణీ చేయాలి

తంబళ్లపల్లె, జనవరి 3(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలంలోని కార్డుదారులకు రేషన్ సరుకులను సకాలంలో పంపిణీ చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ భువనేశ్వరీ సూచించారు. శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ తంబళ్లపల్లె మండల కేంద్రంలోని పలు చౌకదుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్ దుకాణాలలోని రికార్డులతో పాటు కార్డుదారులకు పంపిణీ చేస్తున్న బియ్యం, సరుకుల నాణ్యత, తూనికలు, బియ్యం నిల్వలు తదితరాలను తనిఖీ చేశారు. కార్డుదారులతో మాట్లాడి ప్రతి నెల రేషన్ సరుకులు సకాలంలో పంపిణీ చేస్తున్నారా..?సరుకుల నాణ్యత ఎలా ఉంది.? అన్న విషయాలను ఆరాతీశారు. రేషన్ డీలర్లు, ఎండీయూ నిర్వాహకులు సమన్వయంతో కార్డుదారులకు సకాలంలో రేషన్ సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. రేషన్ పంపిణీలో ఏవైనా సమస్యలు తలెత్తితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది, రేషన్ డీలర్లు ఉన్నారు.

హైందవ శంఖారావానికి తరలి రావాలి


కలికిరిలో ప్రచారం చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

కలికిరి, జనవరి 3 (ఆంధ్ర జ్యోతి): సనాతన ధర్మం, హిందూ దేవాలయాల పరిరక్షణ కోసం ఆదివారం విజయవాడలో జరుగ నున్న హైందవ శంఖారావం మహాసభకు తరలిరావాలని వీహెచ్‌పీ రాష్ట్ర సామాజిక సమరసత కన్వీనరు చింతపర్తి మహేష్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్థానిక అయ్యప్ప స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సమా వేశంలో ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణ కోసం హైంద వుల్లో చైతన్యం పెంపొందించడానికి ఈ మహా సభ ద్వారా శ్రీకారం చుట్టనున్నట్లు మహేష్ చెప్పారు. హిందూ ఆలయాల పరిరక్షణ కోసం జాతీయ స్థాయిలో ఉద్యమానికి నాందీ పలకను న్నట్లు వివరించారు. ప్రతి హిందువు తన వంతు బాధ్యతగా తరలి వచ్చి హైందవ శంఖారావం సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా పట్టణంలో ప్రచార రథంలో సందేశాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గోరక్ష ప్రముఖ్ హరినాథప్రతాప రాజు, శ్రీలక్ష్మీ, పాలేటయ్య, రమేష్‌బాబు పాల్గొన్నారు.

పీలేరుకు 'అన్నా క్యాంటీన్' మంజూరు

పీలేరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవతో పీలేరు పట్టణానికి 'అన్నా క్యాంటీన్' మంజూరైనట్లు ఈవోపీఆర్‌ఆర్‌డీ లతీఫ్ ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాంటీన్ నిర్మాణానికి అనువుగా పట్టణంలో స్థల ఎంపిక చేయాలని తహసీల్దారును ఎమ్మెల్యే ఇప్పటికే ఆదేశించారని, స్థల ఎంపిక జరగగానే నిర్మాణ పనులు చేపడతారని ఆయన తెలిపారు.